



నర్సింగ్.. నై

- విద్యార్థులతో నెట్టుకొస్తున్నారు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత
- వైద్య పరికరాల లేమి.. సిబ్బందీ అరకొరే
- ఓపీలకు అనుగుణంగా పెరిగిన వసతులు
- సకాలంలో చికిత్సలు అందక ప్రాణాలు హరీ





పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు లేక ఖాళీగా వున్న కుర్చీలు

వైద్య చికిత్సలో నర్సుల పాత్ర ఎంతో కీలకం. చికిత్సలకు ముందు రోగులు, బాధితులకు సేవలు అందించేది నర్సులు. ఇంజక్షన్ల నుంచి గాయాలకు కట్లు కట్టడంతో పాటు శస్త్రచికిత్సల్లో వైద్యులకు సహాయకారిగా ఉండేది నర్సులే. ఇలాంటి నర్సులు కొరత ప్రభుత్వ ఆస్పత్రుల్లో నెలకొంది. వివిధ విభాగాల్లో ఇతర సిబ్బంది.. పరికరాలు.. అన్నీ ఉన్నా నర్సులు లేకపోవడంతో రోగులకు సరైన చికిత్సలు సక్రమంగా అందడంలేదు. ప్రధానంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ఏరియా ఆస్పత్రుల్లో కూడా నర్సుల కొరత వెంటాడుతోంది. ఆయా ఆస్పత్రుల్లో నర్సింగ్ చదివే విద్యార్థులతో సరిపెడుతున్నారే కాని నర్సింగ్ సిబ్బంది నియామకంపై అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. పగలు నర్సింగ్ విద్యార్థులు ఉన్నా రాత్రి వేళల్లో నర్సులు కొరతతో రోగులు ఇక్కట్లు పడుతున్నారు. నర్సుల పోస్టులు భర్తీ చేయాలని లేఖలు రాస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ స్పందించడంలేదన్న విమర్శలున్నాయి. ఇక పెరుగుతున్న ఓపీలకు, రోగులకు అనుగుణంగా వసతులు, సౌకర్యాల కల్పనలోనూ ప్రభుత్వం పట్టీపట్టనట్లుగా ఉంటుందన్న ఆరోపణలున్నాయి. కొన్ని ఆస్పత్రులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు కూడా అన్ని విభాగాల్లో లేరని సమాచారం.

నరసరావుపేట: ఆస్పత్రిలో రోగికి వైద్య సేవలు అందజేస్తున్న నర్సింగ్ విద్యార్థులు



(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

పేరుకు అవి పెద్దాస్పత్రులే. ఇక్కడ నర్సులు ఉండరు.. వైద్యులు ఉండరు.. పరికరాలు, సౌకర్యాలు, మందులూ అంతంతే. ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీని తట్టుకోలేక పేద, మధ్య తరగతి వర్గాలు ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో గత కొంతకాలంగా ఓపీ రోగులు విపరీతంగా పెరిగిపోతున్నారు. అయితే రోగుల సంఖ్యకు అనుగుణంగా చాలా ఆస్పత్రుల్లో నర్సుల నియామకాలు జరగడం లేదు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లుగా ఏరియా వైద్యశాలల్లో సౌకర్యాల కల్పనపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. దీంతో ఇప్పుడు ఆస్పత్రుల్లో రోగులకు కష్టాలు రెట్టింపయ్యాయి. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందడం గగనంగా మారింది. రెండేళ్ల క్రితం వరకు ఏరియా ఆసుపత్రుల్లో 200 వరకు మాత్రమే ఉండే ఓపీల సంఖ్య ప్రస్తుతం అది 400 వరకు చేరుకుంది. కానీ అరకొరగా అవే వైద్య పరికరాలు, చాలీచాలని సిబ్బందితోనే ఇప్పుడు కూడా వైద్యం అందిస్తున్నారు. దీంతో ప్రాంతీయ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మిగులుతోంది. పల్నాడు, బాపట్ల జిల్లాలుగా ఆవిర్భవించి రెండున్నరేళ్లు దాటినా జిల్లా ఆస్పత్రుల ఏర్పాటు ఊసే మరిచారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడచినా ఏరియా ఆస్పత్రులలో వసతుల కల్పనతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఖాళీల భర్తీపై నిర్మాణాత్మక ప్రకటన ఇప్పటికీ విడుదలకాలేదు. ఆస్పత్రుల నిర్వహణపై పాలకులకు చిత్తశుద్ధి కొరవడిందన్న విమర్శలున్నాయి. మొక్కుబడిగా ప్రభుత్వాస్పత్రులను నిర్వహిస్తున్నట్లుగా ఇక్కడ నెలకొన్న పరిస్థితులు తెలియజేస్తున్నాయి.

- నరసరావుపేటలోని 200 పడకల ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బంది కొరతతో పాటు కొంత కాలంగా నర్సుల పోస్టులు భర్తీకి నోచుకోలేదు. 40 మంది నర్సులకు 16 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. పట్టణంలోని వివిధ కళాశాలల నర్సింగ్ విద్యార్థులు రోగులకు సేవలు అందిస్తున్నారు. నర్సులతో పాటు రెండు వైద్యుల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. నరసరావుపేట వైద్యశాలలో క్లిష్టమైన చికిత్సలు రోగులకు అందుబాటులో లేవు. 10 బెడ్లతో ఐసీయూని ఏర్పాటు చేసినా వైద్యులు, సిబ్బంది నియామకం జరిగే వరకు సేవలు అందుబాటులోకి వచ్చే పరిస్థితులు లేవు.
- పిడుగురాళ్లలో ప్రభుత్వఆస్పత్రి మార్కెట్ యార్డులోని విశ్రాంతి భవనంలో కొనసాగుతుంది. అక్కడ ఫార్మాసిస్టు లేకపోవడంతో స్టాఫ్ నర్సే రోగులకు మందులు అందిస్తుంటారు. ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు లేరు. ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించాలని గతంలో కలెక్టర్ ఆదేశించినా నేటికీ అమలు కాలేదు. సాయంత్రం 5 గంటల తర్వాత ఆస్పత్రికి తాళాలు వేస్తారు. గురజాల ఏరియా వైద్యశాలలో ఆరుగురు నర్సులకు ఐదుగురు ఉన్నారు. ఇక్కడ సాధారణ వ్యాధులకే చికిత్సలు అందుతున్నాయి.
- మాచర్ల పరిధిలోని అర్బన్ హెల్త్‌సెంటర్లలో వైద్యులు లేరు. ఇన్‌చార్జి డాక్టర్లతో నెట్టుకొస్తున్నారు. ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హెడ్‌నర్సులే ఇక్కడ మందులు అందజేస్తున్నారు.
- సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో నవజాత శిశువుల స్థిరీకరణ విభాగంలో ముగ్గురు స్టాఫ్ నర్సులను, ఒక మెడికల్ ఆఫీసర్‌ను నియమించాలి. ఆస్పత్రికి వచ్చిన ఏడు వెంటిలేటర్లు స్టాక్‌రూమ్‌లో మూలకు చేరాయి. ఆక్సిజన్ ప్లాంట్, కంప్రెషర్ మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. ఆక్సిజన్ అవసరమైతే నరసరావుపేట వెళ్లి సిలిండర్లను తెచ్చుకుంటున్నారు. ఆపరేషన్ థియేటర్ లేదు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య కొంత మంది వైద్యులు అందుబాటులో ఉండటంలేదు.
- వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుల కొరత రోగులను ఇబ్బందులకు గురిచేస్తుంది. గర్భిణులు ప్రైవేటు వైద్యశాలలో కాన్పులు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గైనకాలజిస్టు, చిన్న పిల్లల వైద్యులను డిప్యూటేషన్‌పై వేశారే తప్ప వారు సక్రమంగా రోగులకు సేవలందించడంలేదన్న విమర్శలున్నాయి.
- చిలకలూరిపేట ప్రభుత్వ వంద పడకల ఏరియా ఆస్పత్రిలో రేడియాలజిస్ట్, ఆప్తమాలజిస్ట్, సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతిరోజు ఔట్ పేషెంట్ విభాగంలో 350 మంది వరకు రోగులు వస్తున్నా నర్సులు 22 మంది, హెడ్ నర్సులు ఆరుగురు మాత్రమే ఉన్నారు.

మందుల సరఫరా అంతంతే

వైద్యశాలలకు మందుల సరఫరా అంతంతమాత్రంగానే ఉంది. రోజూ వందలాది మంది రోగులు చికిత్స కోసం వస్తున్నా ఆ స్థాయిలో మందులు సరఫరా లేదు. దీంతో ఆస్పత్రిలోని ప్రైవేట్ షాపుల్లో మందులను రోగులు కొనుగోలు చేస్తున్నారు. రోగుల సంఖ్య పెరగడంతో సరఫరా అవుతున్న మందుల నిల్వలు సరిపోవడంలేదని సిబ్బంది చెబుతున్నారు. మందుల ఇండెంట్‌ను పెంచాల్సి ఉంది. ప్రతి రోజు వైద్యం కోసం వచ్చే వారిని అంచనా వేసి అందుకు తగ్గట్టుగా మందుల సరఫరాను పెంచాలని రోగులు కోరుతున్నారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో రోగులు

రిజిస్ట్రేషన్లకు గండం

- రైతుల ప్లాట్లకు సీఆర్డీఏ మోకాలడ్డు
- సమీకరణ భూముల్లో అసైన్డ్ ఉంటే అంతే సంగతి
- అధికారుల తీరుపై రాజధాని రైతుల ఆగ్రహం
- నాట్ ట్యాలీడ్ పేరుతో కౌలు ఎగవేతపైనా ఆవేదన

(గుంటూరు- ఆంధ్రజ్యోతి)

ఇలా ఒకరు, ఇద్దరు కాదు నీరుకొండ, కురగల్లు గ్రామాల్లోనే 600 మంది ప్లాట్లు రిజిస్ట్రేషన్‌ను అధికారులు ఆపేశారు. ఇలా రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో వందలాది మంది రైతుల రిటర్నబుల్ ప్లాట్లను సీఆర్డీఏ అధికారులు రిజిస్ట్రేషన్ చేకుండా నిలిపివేశారు. 2015లో భూసమీకరణ పథకం కింద భూములిచ్చిన రైతులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏటా కౌలు చెల్లించడంతోపాటు రైతులకు గృహ సముదాయం, వాణిజ్య సముదాయం కింద రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించింది. 2019 ఎన్నికలకు ముందు వరకూ ఆ ప్రభుత్వం వారి ప్లాట్లను రిజిస్టర్ చేసింది. అయితే ఎన్నికల నాటికి ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను పూర్తిగా పక్కనపెట్టింది. గడిచిన ఐదేళ్ళ రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. కిందటి ఎన్నికలకు ఏడాది ముందు వైసీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల పేర హడావుడి చేసినా రైతులు మాత్రం ముందుకు రాలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతులు తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ముందుకు వస్తున్నారు. అయితే సీఆర్డీఏ అధికారులు

(మిగతా 6వ పేజీలో..)

- నీరుకొండకు చెందిన జొన్నలగడ్డ విష్ణువర్దనరావు ఆరున్నర ఎకరాల పట్టాభూమి, 70 సెంట్లు ఫారెస్టు భూమిని ల్యాండ్ భూ సమీకరణ కింద ఇచ్చారు. అతడికి ఫుల్ ప్యాకేజీ ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అతడి రిటర్నబుల్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారు. రెండు నెలల నుంచి సీఆర్డీఏ కార్యాలయం చుట్టూ తిరిగి ఆయన విసిగి వేసారిపోయారు.

- కురగల్లుకు చెందిన మాదల సుజాత అనే మహిళా రైతు ఐదు ఎకరాలు పట్టాభూమి, అర ఎకరం ఫారెస్టు భూమిని భూ సమీకరణ కింద ఇచ్చారు. ఆమెకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడానికి సీఆర్డీఏ అధికారులు ఆపుతున్నారు. ఆ రైతులు ఇచ్చిన పట్టా భూముల తాలూకు రిటర్నబుల్ ప్లాట్లను కూడా సీఆర్డీఏ అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం లేదు.

7న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్

- ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7న బాపట్లలో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను గొప్పగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరవుతున్నందున ఏర్పాట్లలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనపై జిల్లా అధికారులతో బుధవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. బాపట్ల పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించాలన్నారు. విద్యార్థుల తల్లులతో నిర్వహించే ముగ్గుల పోటీలు మహిళా శిశుసంరక్షణ పీడీ కె.ఉమా పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పోటీలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్ట్ కమిటీ కోఆర్డినేటర్‌గా ఇంటర్మీడియట్‌బోర్డు ఆర్ఐవో పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఈవో ఎస్.పురుషోత్తం, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజాదెబోరా, ఉద్యానశాఖాధికారి జెన్నెమ్మ, డీపీవో ప్రభాకరరావు, ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంపిణీ చేయకుండానే.. పాడయ్యాయి

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించడంతో, ఎస్సీ యువతను గ్రూపులుగా చేసి స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కొనుగోలు చేసిన ఆ స్వయం ఉపాధి యూనిట్లు నాలుగేళ్ళుగా గోదాములకే పరిమితం అయ్యాయి.....కోట్లాది రూపాయలు ప్రజాధనం వెచ్చించి కంపెనీల నుంచి కొనుగోలు చేసిన ఆ పరికరాలు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టి పోతున్నా, గోదాముల గోడలు కూలి ధ్వంసం అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నా ఎస్సీలు, ఎస్టీలు, నా బీసీలు అంటూ నాడు డాంబికాలు పలికిన జగనన్నకు ఆయా యూనిట్లు పంపిణీ చేయాలన్న స్పృహ రాకపోవడంతో నాడు ఎస్సీల స్వయం ఉపాధి కాగితాలకే పరిమితమైన వైనమిది.

- గోదాములకే పరిమితమైన ఎస్సీల స్వయం ఉపాధి యూనిట్లు
- తుప్పు పట్టి, ధ్వంసమైపోతున్నా పట్టించుకోని వైనం
- భారీ సంఖ్యలో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు
- నాలుగేళ్ళయినా పంపిణీ చేయని ఎస్సీ కార్పొరేషన్



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం పక్కన షెడ్డులో గోడకూలి అద్దాలు ధ్వంసమైన ఆటో

గుంటూరు(విద్య), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నాడు టిడిపి ప్రభుత్వం అనేక స్వయం ఉపాధి పథకాలు అమలు చేసింది. ప్రత్యేకించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు రుణాలు ఇప్పించి ఎస్సీ యువత సొంత కాళ్ళపై నిలబడేలా చేశారు. అయితే 2019 తరువాత అధికారంలో వచ్చిన వైకాపా ప్రభుత్వం ఎస్సీ స్వయం ఉపాధి పథకాల్ని సమాధి చేసింది. అమలు చేసిన ఒకటీ అరా పథకాలు కూడా ఎస్సీలకు చేరలేదు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమే గోదాముల్లో మూలుగుతున్న స్వయం ఉపాధి యూనిట్లు. గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం అమలు చేయడంతోపాటు ఎస్సీ యువతను గ్రూపులుగా చేసి స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఎస్సీ కార్పొరేషన్ నిధులతో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు కొనుగోలు చేశారు. అయితే వీటి కొనుగోళ్లలో భారీ మొత్తం కమీషన్ల రూపంలో చేతులు మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆటో రూ.2.50లక్షలు, ట్రాక్టర్ రూ.5.60లక్షలు, మినీ ఎక్సకవేటర్‌కు రూ.10లక్షలు వెచ్చించినట్లు సమాచారం. రాష్ట్ర స్థాయిలో పెద్దమొత్తంలో ఆయా పరికరాలు కొనుగోలు చేశారు. జిల్లాల వారీగా పంపిణీ చేయాలని, వాటిని జిల్లా కేంద్రాల్లోని ప్రైవేటు గోదాములకు తరలించారు. అయితే పంపిణీ చేయక ముందే, ఈ ఆటోల్లో సాంకేతిక సమస్యలు వచ్చినట్లు సిబ్బంది చెబుతున్నారు. బ్యాటరీ బ్యాకప్ లేకపోవడం, చార్జింగ్ సమస్యలు తలెత్తాయి. దీంతో కంపెనీలకు సమాచారం ఇచ్చినా వారు సకాలంలో రాలేదు. ఫలితంగా పంపిణీ నిలిచిపోయింది. దాదాపు నాలుగు సంవత్సరాల నుంచి ఈ యూనిట్లు జిల్లా కేంద్రాల్లో గోదాముల్లో, ఎస్సీ కార్పొరేష్ కార్యాలయాల ఆవరణలో మగ్గుతున్నాయి. ఇందులో కొన్ని ఇప్పటికే ఉపయోగించడానికి వీలులేకుండా పాడైనట్లు సమాచారం. గుంటూరు నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ సమావేశ మందిరం పక్కనే ప్రస్తుతం పదుల సంఖ్యలో ఈ ఆటోలు, ట్రాక్టర్లు, మినీ ఎక్సకవేటర్లు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వయం ఉపాధి యూనిట్లు ఎస్సీ యువతకు పంపిణీ చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతులు చేయించి పంపిణీ చేస్తాం

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గత ప్రభుత్వ హయాంలో వీటిని కొనుగోలు చేశామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పీ ప్రేమకుమారి "ఆంధ్రజ్యోతి"కి వివరించారు. ఈ ఆటోలు, ట్రాక్టర్స్, ఎక్సవేటర్లు కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా పంపిణీ చేయలేదని, వాటికి మరమ్మతులు నిర్వహించి లబ్ధిదారులకు లేదా మున్సిపాల్టీలకు ఇవ్వాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించినట్లు ఈడీ ప్రేమకుమారి తెలిపారు.



ఎటువంటి రక్షణ లేకుండా ఆరుబయట ఉన్న ట్రాక్టర్లు

సౌత్ ఇండియా పోటీల్లో జిల్లా లిఫ్టర్ల ప్రతిభ



పతకాలు సాధించిన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని సేలంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన పవర్ లిఫ్టర్లు రెండు స్వర్ణ పతకాలు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలు సాధించినట్టు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. మహిళల 84 కిలోలు పైబడిన సీనియర్స్ విభాగంలో బొల్లినేని చంద్రిక స్వర్ణ పతకంతోపాటు స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్-2, జూనియర్స్ 84 కిలోలు పైబడిన విభాగంలో ఎస్కే షబీనా స్వర్ణ పతకం, సబ్‌జూనియర్స్‌లో పి.శ్రావణి రజతం, జూనియర్స్‌లో చాతుర్య, వినయశ్రీలు కాంస్య పతకాలు, పురుషుల సబ్‌జూనియర్స్ విభాగంలో జి.హేమవర్ధన్ రజత పతకం, జి.నాగగణేష్ కాంస్య పతకం సాధించారని చెప్పారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, సౌత్‌ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్‌ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

7న విజ్ఞాన్ యూనివర్సిటీలో స్నాతకోత్సవం



పోస్టర్స్ విడుదల చేస్తున్న వీసీ నాగభూషణ్

గుంటూరు(విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ లెర్నింగ్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు డిసెంబర్ 7న స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు కలిసి స్నాతకోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావ్ హాజరవుతారని తెలిపారు. స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ (ఎంబీఏ, ఎంసీఏ) ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వారా విద్య పూర్తి చేసుకున్న 880 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందని వైస్ ఛాన్సలర్ నాగభూషణ్ తెలిపారు.

కృషి, పట్టుదలతో ఉజ్వల భవిష్యత్తు

పెదకాకాని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో అనుకున్న రంగాల్లో రాణించాలంటే కృషి, పట్టుదల అవసరమని, తద్వారా ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చని ఏఎన్‌యూ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగ అధిపతి, దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో ఉన్న ఆమోదిని స్వచ్ఛంద సంస్థలో భోజన వితరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. నేటి సమాజానికి రోల్ మోడల్‌గా నిలవాలని సూచించారు. సమాజంపై అవగాహనతో సేవా కార్యక్రమాలు నిర్వహించటం సంతోషకరమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 40.72 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు.

డేగల కష్టానికి ప్రతిఫలంగా ఏపీఐడీసీ చైర్మన్ పదవి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- అట్టహాసంగా డేగల అభినందన సభ
- ఎమ్మెల్యేలు, కూటమి నేతల సందడి
- కదం తొక్కిన డేగల యూత్, అభిమానులు



డేగలను సన్మానిస్తున్న మంత్రి సవిత, ఆనందబాబు, పుల్లారావు, ఆలపాటి, నసీర్, మోపిదేవి

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పార్టీ కోసం నిలిచి, అవిశ్రాంతంగా పోరాడిన డేగల ప్రభాకర్‌ను ఏపీఐడీసీ చైర్మన్‌గా నియమించి ముఖ్యమంత్రి చంద్రబాబు తగిన గౌరవాన్ని కల్పించారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కొనియాడారు. ఏపీఐడీసీ చైర్మన్‌గా నియమితుడైన సందర్భంగా బుధవారం డేగల అభిమానులు, డేగల యూత్ సభ్యులు అట్టహాసంగా ఆయన అభినందన సభ నిర్వహించారు. గుంటూరు నాజ్‌సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి సిద్ధార్థ గార్డెన్స్ వరకూ కూటమి పార్టీల కార్యకర్తలు, డేగల అభిమానులు, యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని నగర వీధుల్లో సందడి చేశారు. సిద్ధార్థ గార్డెన్స్ వద్ద ఆయనకు అభిమానులు భారీ గజమాలతో ఘనం స్వాగతం పలికారు. అనంతరం సిద్ధార్థ గార్డెన్స్‌లో నిర్వహించిన అభినందన సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, అతిథులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హాజరై డేగల ప్రభాకర్‌కు అభినందనలు తెలిపారు. మంత్రి సవిత మాట్లాడుతూ పార్టీ కోసం, కార్యకర్తల కోసం నిరంతరం శ్రమించిన డేగల ప్రభాకర్‌కు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కడం అభినందనీయమన్నారు. ఈ పదవితో ప్రభాకర్‌కు బాధ్యత మరింత పెరిగిందన్నారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపనకు తనదైన శైలిలో కృషి చేయాలన్నారు. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ పార్టీకి కష్టకాలంలో అండగా, ఆర్థికంగా, చేయూతగా ప్రభాకర్ నిలబడ్డారని కొనియాడారు. పరిశ్రమలను అభివృద్ధి చేయాలని సూచించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసేవారికి ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందనటానికి నిదర్శనం డేగల ప్రభాకర్‌ను చైర్మన్‌గా నియమించడమేనని అన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా మాధవి మాట్లాడుతూ గుంటూరు నగర అభివృద్ధిలో డేగల ప్రభాకర్ ముందుండాలని ఆకాంక్షించారు. డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కష్ట పడేవారికి తగిన గుర్తింపు ఉంటుంది అనటానికి నిదర్శనం తనకు ఈ పదవి దక్కడమేనని అన్నారు. తనకు ఈ పదవి కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను మూసివేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తోందని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా నూతన పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తూ, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి, బాపట్ల ఎమ్మెల్యే వేగేసిన నరేంద్ర వర్మ, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ మంత్రులు మోపిదేవి వెంకటరమణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, లిడ్‌కాప్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టెక్నాలజీ సంస్థ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, టూరిజం చైర్మన్ నుకసాని బాలాజీ, కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ షేక్ షాజిల, రాష్ట్ర నాయకులు చిత్తబత్తిన చిట్టిబాబు, కనపర్తి శ్రీనివాస్, మద్దిరాల మ్యాని, కాసుకుర్తి హనుమంతరావు, బీసీ సెల్ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, ఆమంచి స్వాములు, తెలుగు యువత నాయకులు మల్లి, ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్, గాదె వెంకటేశ్వర్లు, పార్వతి నాయుడు, వడ్రాణం మార్కండేయ బాబు పాల్గొన్నారు.

ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



వల్లభాపురంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం కొల్లిపర మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ భార్గవ్‌తేజతో కలిసి ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఎంత మేర కొనుగోలు చేశారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమాన్‌పాలెంలో జరిగిన సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ ధాన్యం తేమశాతం 17 కంటే ఎక్కువ ఉన్నా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు 24 గంటల వ్యవధిలోనే వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఏడీఏ ఉషారాణి, సివిల్ సప్లై డీఎం శ్రీలక్ష్మి, తహసీల్దార్ సిద్ధార్థ, వివిధ శాఖాధికారులు, నాయకులు వంగా సాంబిరెడ్డి, అడపా నారాయణరెడ్డి, మొవ్వా వెంకయ్య, ఆళ్ల వీరారెడ్డి, యర్రు వెంకయ్యనాయుడు, భీమవరపు కిశోర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు పెడతాం..

తాడేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వ్యాపారస్తులు కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొంటే క్రిమినల్ కేసులు పెడతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు, గుండిమెడ విచ్చేసిన ఆయన ధాన్యం కల్లాల వద్ద రైతులతో మాట్లాడి ధాన్యాన్ని పరిశీలించారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నేతలు పల్లె కృష్ణ, పి.సుబ్బారావు, బొప్పన గోపాలరావు, శివనాగేశ్వరరావు, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం సాయంత్రం జంపని గ్రామంలో రైతులను కలుసుకున్నారు. రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు.

రైతులు సద్వినియోగం చేసుకోండి

దుగ్గిరాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి ప్రభుత్వం ఇస్తున్న మంచి ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండల గ్రామం గొడవర్రు సమీపంలో కరకట్ట అంచున రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని బుధవారం పరిశీలించిన మంత్రి మనోహర్ రైతులతో మాట్లాడుతూ క్వింటాల్‌కు రూ.2300 నుంచి రూ.2320, 75 కిలోల బస్తాకు రూ.1725 నుంచి రూ.1740 చెల్లిస్తోందన్నారు. సర్పంచ్ విశ్వనాధపల్లి ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు శివకుమార్, జేసీ ఎ.భార్గవ్‌తేజ, వీఆర్వోలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అధికారులపై మంత్రి ఆగ్రహం

కొల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు అమ్మి నష్టపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు సూచించారు. బుధవారం కొల్లూరు మండలంలోని ఈపూరు, క్రాప గ్రామాల వద్ద రైతులు రోడ్లపై ఆరబెట్టుకున్న ధాన్యాన్ని మంత్రి పరిశీలించారు. తేమశాతం ఎక్కువగా ఉందనీ, నిబంధనలకు లోబడి ఉంటేనే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారని రైతులు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. పైగా చాలా మంది రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది ఈకేవైసీ, ఈక్రాప్ చేయలేదనీ, దాని వల్ల కూడా తమ పంట కొనుగోలు చేయమంటున్నారని చెప్పారు. క్రాప వద్ద రైతులు కౌలు రైతు కార్డులు కూడా తమకు జారీ చేయలేదని మంత్రి దృష్టికి తీసుకు రావడంతో అధికారులపై వచ్చిన ఆరోపణలపై వారిని ప్రశ్నించగా ఆయా శాఖల అధికారులు నీళ్లు నమలడంతో వారిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సివిల్ సప్లై జిల్లా అధికారి విలియమ్స్, వ్యవసాయ శాఖ డీఏవో రామకృష్ణ, రేపల్లె ఏడీఏ విజయబాబు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఏవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లకు గండం

(5 పేజీ తరువాయి)

సవాలక్ష కొర్రీలు పెట్టి వాటిని రిజిస్టర్ చేయకుండా ఆపుతున్నారు.

అసైన్డ్, ఫారెస్టు ల్యాండు వంక

రైతులు ఇచ్చిన భూములు పట్టాభూములైతేనే రిజిస్ట్రేషన్ చేస్తామని, అసైన్డ్ భూములు ఉంటే వాటిని చేయమని ఆపారు. కొంతమంది రైతులు పట్టా భూములతోపాటు అసైన్డ్, పారెస్టు, సైనికులకు ఇచ్చిన భూములను కూడా ల్యాండ్ పూలింగులో ఇచ్చారు. ఇప్పుడు ఆ వంక పెట్టి వాటి రిటర్నబుల్ ప్లాట్లను సీఆర్డీఏ అధికారులు ఆపేశారు. వాటితోపాటు పట్టా భూములు కూడా ఇచ్చి ఉంటే వాటిని కూడా ఆపేశారు. దీంతో రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చినా సీఆర్డీఏ అధికారుల తీరులో ఏమాత్రం మార్పు రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మూడేళ్లుగా కౌలు బకాయిలు

రాజధాని కోసం భూములిచ్చిన అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ విచారణ పేరుతో గత ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగింది. అసైన్డ్ రైతుల భూములను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టింది. మొత్తం 1600 మంది రైతుల పొలాలను నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి 1300 మందికి క్లీన్ చిట్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మిగిలిన 1300 మందికి క్లీన్‌చిట్ వస్తుందని, అందరితోపాటు తమకు కౌలు వస్తుందని భావించారు. కానీ అసైన్డ్ రైతుల ఆశ నిరాశగానే మిగిలింది.

కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు అవుతున్నా వారి భూములు ఇప్పటికీ నాట్ ట్యాలీడ్ జాబితాలోనే ఉన్నాయి. మూడేళ్లుగా కౌలు బకాయిలు అలానే ఉన్నాయి. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అసైన్డ్ రైతులు సీఆర్డీఏ అధికారుల తీరును నిరసిస్తున్నారు. సీఐడీ విచారణ పేరుతో కౌలు చెల్లించకుండా జాప్యం చేస్తున్న ప్రభుత్వ తీరుపైనా వారు ఆగ్రహంతో ఉన్నారు. మంత్రి నారాయణ, నారా లోకేశ్‌లను కలిసి తమ గోడు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో టీడీపీకి చెందిన పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

- ఇదే అదనుగా రోడ్డు నిర్మాణానికి తరలిస్తున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు



వెంకుపాలెం కొండ సమీపంలో మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

వినుకొండటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మట్టికి విపరీతమైన డిమాండ్ ఉండడంతో ప్రభుత్వ భూమి కనపడితే చాలు అక్రమార్కులు ఆ భూములను కబ్జాచేసి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వినుకొండ మండలం వెంకుపాలెం కొండ సమీపంలోని సర్వే నంబరు 1లో కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండ గత కొంతకాలంగా మట్టిని తరలిస్తూ అక్రమంగా లక్షలు గడిస్తున్నారు. కారంపూడి రోడ్డు నుంచి వెల్లటూరు రోడ్డు వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర తారు రోడ్డు మంజూరైంది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇదే అదునుగా గుట్టుచప్పుడు కాకుండ సుమారు రూ.4 కోట్లు విలువ చేసే రోడ్డు నిర్మాణ పనులకు మట్టిని తరలించి చకచక పనులు కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా కొందరు ఆ మట్టిని వినుకొండ పట్టణంలోని పలు ప్రాంతాలకు విక్రయించి అక్రమంగా లక్షల గడిస్తున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు పలువురు సమాచారం అందించినప్పటికీ వారు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఇప్పటికే సర్వే నంబరు 1లో సుమారు 25 ఎకరాల మేరకు 15 అడుగుల మేర మట్టిని తరలించారు. గత కొంత కాలంగా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. ఇకనైనా జిల్లా రెవెన్యూ, మైనింగ్ అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అక్రమంగా మట్టిని తరలించి నిర్మిస్తున్న రోడ్డు

వాహనాలను నిలిపివేస్తాం...

రోడ్డు నిర్మాణ పనులకు వినియోగిస్తున్న మట్టి తవ్వకాలకు అనుమతులపై తహసీల్దార్ సురేష్ నాయక్‌ను వివరణ కోరగా మట్టిని తరలిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని, సిబ్బందిని పంపించి వాహనాలను నిలుపుదల చేస్తామని తెలిపారు.

అధికలోడుతో ప్రయాణం నిషేధం

- రూ.20 వేలతోపాటు టన్నుకు రూ.2 వేలు జరిమానా
- రవాణా శాఖాధికారి టి.సంజీవ్ కుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'మోటార్ వాహన చట్టం ప్రకారం అనుమతించిన వాహనాలు బరువుకు మించి అధికలోడుతో ప్రయాణించడం నిషేధం. అనుమతించిన బరువు కన్నా 5.1 వరకు మార్జిన్ ఉంది. అంతకుమించి బరువుతో వాహనాలు రహదారుల్లో ప్రయాణిస్తే జరిమానాలు విధిస్తాం' అని రవాణాశాఖాధికారి టి.సంజీవ్ కుమార్ తెలిపారు. 'మామూళ్ల ఓవర్‌లోడ్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం వెలువడిన కథనానికి ఆయన స్పందించారు. అనుమతికి మించి అధిక లోడ్‌తో టిప్పర్లు, లారీలు ప్రయాణిస్తే మోటార్ వాహన చట్టం ప్రకారం రూ.20వేలతో పాటు అదనంగా ప్రతి టన్నుకు రూ.2 వేలు జరిమానా విధించడంతోపాటు డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అధిక లోడ్‌తో ప్రయాణిస్తున్న వాహనాలను గుర్తించి వారిపై 29 కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాగా రూ.12,84,700 వసూలు చేసినట్లు తెలిపారు. అధిక లోడుతో వాహనాలు తిప్పకుండా టిప్పర్ యజమానులు రవాణా శాఖకు సహకరించాలని కోరారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ వన్ టౌన్ సీఐ లత, ఎస్ఐలు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మద్యాన్ని తీసుకొచ్చి గుంటూరులో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ వన్ టౌన్ సీఐ బి.లత బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ ఇంతియాజ్ అలియాస్ మున్న అనే వ్యక్తి తెలంగాణ రాష్ట్రం నుంచి 13 మ్యాన్షన్ హౌస్ బ్రాందీ బాటిళ్లను తీసుకొచ్చి ద్విచక్ర వాహనంపై పొన్నూరు రోడ్డులోని కరెంట్ ఆఫీస్ వద్ద విక్రయిస్తున్నాడు. అదేవిధంగా టూ టౌన్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని లాలుపురం గ్రామానికి చెందిన దేవరశెట్టి శ్రీనివాసరావు అనే వ్యక్తి చిలకలూరిపేట రోడ్డులో ఏటుకూరు రోడ్డు సమీపంలోని హైవే అండర్ పాస్ వద్ద 12 తెలంగాణ మద్యం బాటిళ్లను ద్విచక్ర వాహనంపై తిరుగుతూ విక్రయిస్తున్నాడు. సమాచారం మేరకు వీరిద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద 25 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్సైలు తిరుమలేశ్వరరావు, మహమ్మద్ ఖాసిం షరీఫ్, కానిస్టేబుళ్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ భర్త మృతి
- కోలుకున్న భార్య

నకరికల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మొదట భార్య ఆత్మహత్యాయత్నం చేసింది. ఇది తట్టుకోలేక భర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. భార్య కోలుకోగా, భర్త మృతి చెందాడు. నకరికల్లు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నరసరావుపేట ఇస్లాంపేటకు చెందిన షేక్ ఖాదర్‌వలి, మంజు దంపతులు వీరి కుమార్తెకు పది నెలల క్రితం వివాహం చేశారు. ఇంతకుముందు ఉన్న అప్పులకు తోడు వివాహం సందర్భంగా అప్పులు చేయడంతో మొత్తం రూ.5 లక్షలకు అప్పు చేరుకుంది. అప్పు తీర్చే మార్గం కన్పించక భార్య, భర్తలు ఇద్దరూ తరచూ గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21న ఖాదర్‌వలి, మంజుల మధ్య ఘర్షణ జరగటంతో మంజు ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం ఆమెను నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనతో మనస్తాపానికి గురైన ఆమె భర్త ఖాదర్‌వలి ఈ నెల 24న నకరికల్లు అడ్డరోడ్డు వద్దకు వచ్చి ఎలుకల మందు తిని వాంతులు చేసుకున్నాడు. వాంతులతో భయానికి గురైన ఖాదర్‌వలి తన స్నేహితునికి ఫోన్ చేసి తాను ఎలుకల మందు తిన్నానని, ఆస్పత్రికి తీసుకువెళ్లాలని కోరాడు. దీంతో ఖాదర్‌వలిని అతని స్నేహితుడు నరసరావుపేట ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతున్న అతని భార్య మంజు కోలుకొని ఈ నెల 26న ఇంటికి చేరుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖాదర్‌వలి బుధవారం మృతి చెందాడు. నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైళ్ల రద్దు, దారి మళ్లింపు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా నంద్యాల మార్గంలో కొన్ని రైళ్లను రద్దు, మరికొన్నింటిని దారి మళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలు తెలిపాయి. డిసెంబరు 3 నుంచి 13వ తేదీ వరకు నంబరు 17228 గుంటూరు - డోన్, డిసెంబరు 4 నుంచి 14వ తేదీ వరకు నంబరు 17227 డోన్ - గుంటూరు రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నామని పేర్కొన్నాయి. డిసెంబరు 6వ తేదీన నంబరు 22883 పూరీ - యశ్వంత్‌పూర్, 7వ తేదీన నంబరు 22884 యశ్వంత్‌పూర్ - పూరీ, డిసెంబరు 4, 11 తేదీల్లో నంబరు 22831 హౌరా - యశ్వంత్‌పూర్, డిసెంబరు 6, 13 తేదీల్లో నంబరు 22832 యశ్వంత్‌పూర్ - హౌరా ఎక్స్‌ప్రెస్‌లను నంద్యాల నుంచి దారి మళ్లిస్తారు. నంబరు 17253 గుంటూరు - ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్‌ని డిసెంబరు 4 నుంచి 12వరకు 120 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేసి నడుపుతామని రైల్వేవర్గాలు తెలిపాయి.

హాల్ట్‌స్టేషన్‌గా మారిన చినరావూరు

తెనాలి - రేపల్లె సెక్షన్‌లో ఉన్న చినరావూరు రైల్వేస్టేషన్‌ని రైల్వేబోర్డు హాల్ట్‌స్టేషన్‌గా మార్పు చేసింది. 2025 జనవరి 1వ తేదీ నుంచి ఈ ఉత్తర్వులు అమలులోకి రానున్నాయి. దీంతో ఆ సెక్షన్‌లో ఒక్క వేమూరు మినహా అన్ని హాల్ట్‌స్టేషన్లుగా మారాయి.

వికాస ఎన్నికలకు నామినేషన్లు దాఖలు

పెదకాకాని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘం (వికాస) ఎన్నికలకు బుధవారం నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎస్.మురళీమోహన్ తెలిపారు. కాగా ఉద్యోగులు ఫ్రెండ్స్ ప్యానెల్‌గా ఏర్పడి నామినేషన్ వేశారు. ఫ్రెండ్స్ ప్యానెల్ అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.ప్రసాద్ (అధ్యక్షుడు), డి.విజయ ప్రకాష్ బాబు (ఉపాధ్యక్షుడు), జె.శ్రీనివాసరావు (కార్యదర్శి), టి.వెంకటేష్, ఎస్.నాగేశ్వరరావు (సంయుక్త కార్యదర్శులు), కె.యేషయ్య (కోశాధికారి), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా.. జి.శ్రీను, కె.శశిధర్, పి.నాగరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, ఇ.శ్రీనివాస రెడ్డి, ఎస్.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వరరావు, సీహెచ్ సాంబశివరావు, సీహెచ్ ఆనంద్ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎస్. మురళీ మోహన్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114,122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

43,594 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 46,174 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,594 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 38,956 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13500	334	8000	14500
నెంబరు. 5	8500	12000	నెంబరు.5	8300	12500
273	8200	10000	273	9500	11000
341	8000	14000	341	8000	14500
4884	–	–	4884	8000	14000
సూపర్ 10	11500	11500	సూపర్ 10	9000	11500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	8000	12600
దేవనూరు డీలక్స్	8000	13500	దేవనూరు డీలక్స్	10000	13000
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4500	10000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

విద్యుత్ ప్రాజెక్టు జీఎంగా ఎం శ్రీనివాస్

రెంటచింతల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు జనరల్ మేనేజర్‌గా ఎం శ్రీనివాస్‌ను నియమిస్తూ ఏపీజెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధరబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయవాడ వీటీపీఎస్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. మార్చి 31, 2025 కల్లా 78ఎంయూల విద్యుదుత్పత్తి చేయాల్సి ఉండగా ఇప్పటికే రెండు యూనిట్ల ద్వారా మంగళవారం రాత్రి వరకు 86.475 ఎం యూల కరెంట్‌ను తయారు చేసి లక్ష్యాన్ని అధిగమించినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు.



రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన డేగల ప్రభాకరరావును ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శాలువా కప్పి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. **(సత్తెనపల్లి)**

వార్డుల్లో సమస్యలను పరిష్కరిస్తాం

● మున్సిపల్ చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని 8వ వార్డులో పర్యటించారు. సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలను వార్డువాసులు చైర్మన్ నరసింహారావు దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని, వార్డులో మౌలిక వసతులు కల్పిస్తామని చైర్మన్ నరసింహారావు అన్నారు. కార్యక్రమంలో చల్లా రాజారత్నం, కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

గురజాల సీఐగా ఆవుల భాస్కర్



ఆవుల భాస్కర్

గురజాలటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గురజాల సీఐగా ఆవుల భాస్కర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన పి.భాస్కర్ దాచేపల్లికి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యత లు చేపట్టిన ఆవుల భాస్కర్‌ను ఎస్ఐ వినోద్‌కుమార్, సిబ్బంది అభినందించారు.

పాముకాటుకు మహిళ మృతి

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉదయాన్నే ఇంటి ఆవరణలో ఉన్న గులాబీ చెట్టుకు పూజకోసమని పూలుకోస్తుండగా పాము కరిచి మహిళ మృతి చెందిన ఘటన అమరావతిలో జరిగింది. వివరాల్లోకి వెళితే సంధ్యా థియేటర్ సమీపంలో గల చెవిటికంటి ప్రసాద్ భార్య జయ(55) స్థానిక సీతారామయ్య హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తుంది. బుధవారం ఉదయం పూజకోసమని ఇంట్లో చెట్టుకు పూలుకోస్తుండగా పాము కాటువేసింది. గులాబీ ముళ్లు గుచ్చుకుని ఉంటుందని మిన్నకుండిపోయింది. గంట తరువాత అనుమానం వచ్చి స్థానికుల సహాయంతో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లిగా ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరులోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రసాద్ గతంలో ఆంధ్రప్రభ విలేఖరుగా పనిచేసి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు దాటుతూ యువకుడి మృతి

దాచేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా ఉప్పు లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని కల్యాణి బార్ వద్ద జరిగింది. మృతుడు పిడుగురాళ్ల పట్టణం క్రిస్టియన్‌పేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడు కుక్కమూడి బుజ్జి (45) టెంట్‌హౌస్‌లో సహాయకుడుగా పని చేస్తుంటాడు. మృతుడు బుజ్జి పిడుగురాళ్లలోని ఓ ఫంక్షన్‌లో పని ముగించుకొని దాచేపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో అతను పనిచేస్తున్న మినీలారీ టైర్ పంక్చర్ అయింది. ఆ వాహనాన్ని మెకానిక్ షెడ్‌కు తీసుకెళ్లి రోడ్డు దాటుతుండగా మిర్యాలగూడ నుంచి పిడుగురాళ్ల వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో బుజ్జి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనం ప్రకాశం జిల్లా పసుపుగల్లు గ్రామానికి చెందినదిగా గుర్తించారు. దాచేపల్లి ఎస్ఐ పాపారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నాడు

ఐదుగురు జూదరుల అరెస్టు

దాచేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.17,130, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సౌందర్‌రాజ్ బుధవారం తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

● నలుగురి అరెస్టు

మాచర్లటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలోని కోడెల శివప్రసాదరావు కాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు బుధవారం దాడి చేశారు. ఓ గృహంలో వ్యభిచారం జరుగున్నట్లు గుర్తించి ముగ్గురు మహిళలను, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ ప్రభాకరరావు తెలిపారు.

యేసురాజుకు పోలీసుల కౌన్సెలింగ్

మాచర్లరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకుంటున్న అంటూ సెల్ఫీ వీడియో చేసిన మండలంలోని తాళ్లపల్లి గ్రామ సచివాలయ సర్వేయర్ కేశనబోయిన యేసురాజుకు విజయపురిసౌత్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. యేసురాజు తన స్వగ్రామమైన మండలంలోని కొప్పునూరులో ఉన్నట్లు గుర్తించి బుధవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే పంచాయతీ సెక్రటరీ వెంకట్రామయ్యను కూడా తోటి ఉద్యోగులతో సంయమనం పాటించాలని, సమస్యలుంటే పైఅధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించడంతో సమస్య సద్దుమణిగింది.

టీడీపీ పాలనలో అభివృద్ధి.. వైసీపీ హయాంలో అరాచకాలు

● గత ఐదేళ్లలో దైద ఆలయం అభివృద్ధి శూన్యం
● కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చేస్తాం
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



దైదలో బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి జరిగితే వైసీపీ హయాంలో అరాచకాలు జరిగాయని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దైద బిలంలో ఉన్న శ్రీగంగాపార్వతి సమేత అమరలింగేశ్వరస్వామిని బుధవారం ఎమ్మెల్యే యరపతినేని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో అమరలింగేశ్వరస్వామి దేవాలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని, గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు ఆలయ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. 2014-2019 పుష్కరాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పల్నాడు ప్రాంతంలో ఆలయాల అభివృద్ధికి రూ.150 కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అటవీ శాఖాధికారులతో మాట్లాడి రూ.3 కోట్లతో మట్టి రోడ్డును తారు రోడ్డుగా మార్చామన్నారు. ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్లు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. బిలంలో ఉన్న స్వామిని దర్శించుకునేందుకు భక్తులకు అక్కడక్కడ కూర్చొని వెళ్లాల్సి వచ్చేదని, భక్తుల కోసం నడుచుకుంటూ బిలం లోపలికి వెళ్లేలా చేశామని చెప్పారు. తన సొంత ఖర్చులతో బిలం లోపల ఏసీలు ఏర్పాటు చేయించానన్నారు. వైసీపీ హయాంలో ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోగా, దేవాలయం వద్ద కృష్ణానది ద్వారా తెలంగాణ మద్యం తెప్పించుకొని అమ్మకాలు జరిపి అరాచకానికి తెరలేపారని మండిపడ్డారు. శ్రీశైలం, కోటప్పకొండ తరహాలనే దైద అమరలింగేశ్వరస్వామి దేవస్థానాన్ని కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ హయాలో వసతి గృహాలకు రూ.5 కోట్లు మంజూరుకాగా ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలవడంతో వెనక్కి వెళ్లాయన్నారు. మరలా నిధులు తెప్పించి వసతి గృహాలు ఏర్పాటు చేస్తామన్నారు.

అమరలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

దైద బిలంలో ఉన్న శ్రీఅమరలింగేశ్వరస్వామిని బుధవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీసభ్యులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు జరిపారు. దేవస్థానం ప్రాంగణంలో వెంపటి రామకృష్ణ ఆధ్వర్యాన ప్రతిష్ఠించిన శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం లేళ్ల రామస్వామి మంగమ్మ జ్ఞాపకార్థం లేళ్ల కృష్ణ నూతనంగా ఏర్పాటు చేసిన బస్టు షెల్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంపటి సాంబశివరావు, మాజీ ఎంపీపీ పులుకూరి కాంతారావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, శివనాగు, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్ నేలవల్లి బొల్లయ్య, చాగంటి శ్రీనివాసరావు, కొట్టే శ్రీను, నవులూరి శ్రీరామ్మూర్తి, మాజీ ఎం పీటీసీ శరమాల హనుమంతురావు, ఈవో పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని బాగా అభివృద్ధి చేశారు

● యరపతినేనిని కొనియాడిన భక్తులు

ఆలయాన్ని చాలా బాగా అభివృద్ధి చేశారు.. భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.. అంటూ పలువురు భక్తులు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కొనియాడారు. కార్తీకమాసంను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లాకు చెందిన సుమారు 30 మంది మహిళలు బుధవారం మండలంలోని దైద బిలంలో ఉన్న శ్రీఅమరలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అదే సమయంలో బిలంలో పూజలు ముగించుకొని బయటకు వస్తున్న ఎమ్మెల్యే యరపతినేనిని వారు కలుసుకొని ప్రశంసించారు.

బహిరంగ వేలం

మాచర్లటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘ పరిధిలోని కూరగాయల మార్కెట్, సంద్రి మార్కెట్, మాంసం మార్కెట్, ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో 19 దుకాణాలకు బుధవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు ఆధ్వ ర్యాన బహిరంగ వేలం నిర్వహించారు. కూరగాయల మార్కెట్‌ను మువ్వా చైతన్య రూ.2.40లక్షలకు, సంద్రి మార్కెట్‌ను జి.సత్యనారాయణరెడ్డి రూ.2.19 లక్షలకు, మాంసం మార్కెట్‌ను చల్లా నాగలక్ష్మి రూ.36 వేలకు వేలంలో దక్కించుకున్నట్లు కమిషనర్ వేణుబాబు తెలిపారు. కాగా ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి 9 షాపులకు మాత్రమే వేలంపాట జరిగినట్లు చెప్పారు. వేలం జరగని షాపులకు త్వరలోనే తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

చాపకూడు ఏర్పాట్లపై సమావేశం

కారంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వీరారాధన ఉత్సవాల్లో భాగంగా డిసెంబరు 2వ తేదీన స్థానికంగా నిర్వహించనున్న చాపకూడుపై టీడీపీ నేతలు, అధికారులు బుధవారం వీరుల దేవాలయంలో సమావేశమయ్యారు. కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. నేతలు, అధికారులంతా కలిసికట్టుగా ఉండి అన్ని మతాల వారిని సమన్వయపరిచి విజయవంతం చేయాలని నిర్ణయించారు. అనంతరం టీడీపీ ఆధ్వర్యాన నిర్వహించనున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్లబండలాగు పోటీల ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, ప్రచార కార్యదర్శి గోళ్ల సురేష్ యాదవ్, బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జానీ, చప్పిడి రాము, ఎస్ఐ వాసు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, గ్రామ కార్యదర్శి కసిన్యానాయక్, మాజీ ఉప ఎంపీపీ చావా వీరాంజనేయులు, బీసీ సెల్ కార్యదర్శి గోరంట్ల నాగేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు తుపాకుల చిన రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కేశానుపల్లి రైల్వేగేటు మూసివేత

దాచేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి - కేశానుపల్లి గ్రామాల మధ్య ఉన్న రైల్వేగేటు వద్ద మరమ్మతులు చేపట్టడంతో గేటును మూసివేస్తున్న ట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. రైల్వేగేటు వద్ద పట్టాలకు మరమ్మతులు చేసి రోడ్డుకు అనుసంధానం చేయడంతో సాంకేతికపరమైన పనుల కారణంగా ఒక్కరోజు మాత్రమే రైల్వేగేటు మూసివేసినట్లు వివరించారు. దీంతో దాచేపల్లి నుంచి కారంపూడి, వినుకొండ వెళ్లే ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ మార్గం ద్వారా రాకపోకలు సాగించాలని అధికారులు కోరారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

పిడుగురాళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

● ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలి
● పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి

నకరికల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా అప్రమత్తంగా ఉండాలని, పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని బస్తాల్లో పట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రైతులకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని నరసింగపాడులోని నూర్పిడి జరుగుతున్న కల్లాలను, కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలను పరిశీలించారు. కోత కోయాలనుకున్న వరి పొలాలను ఐదు నుంచి వారం రోజుల వరకు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. నరసింగపాడు, నకరికల్లు, గుండ్లపల్లి గ్రామాల్లో త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే పుల్లారావు, ఏవో కే దేవదాసు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.


చేనుకు చీరే రక్షణ



మండాదిలో చేనుకు రక్షణగా నిలిచిన చీర

వెల్దుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంట చేనుకు చీరే రక్షణగా మారింది. ఒకప్పుడు మండలంలోని అటవీ ప్రాంత సమీపంలో ఉండే పొలాల్లోనే అడవి పందుల బెడద అధి కంగా ఉండేది. రానురాను వాటి ఉధృతి పెరిగి హైవే ప్రధాన రహదారుల వెంబడి పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. ముదురుపత్తి వేసిన రైతులు పత్తి కట్టెను తొలగించి మొక్కజొన్న సాగు చేపట్టారు. వీటిని విత్తన దశలో నే అడవి పందులు వీటిపై ప్రతాపం చూపుతున్నాయి. వీటి నుంచి పంటను కాపాడుకునేందుకు కాపలాదారుడికి రూ.15 వేల దాకా ఖర్చవుతోంది. అంతభారం భరించలేని రైతులు పాత చీరలను కొనుగోలు చేసి చేనుకు చుట్టూ రక్షణగా ఏర్పాటు చేస్తున్నారు.

బంతి సాగుపై రైతుల ఆసక్తి



ధరణికోటలో రైతులు సాగుచేసిన బంతి తోట

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలపరిధి గ్రామాల్లోని పలువురు రైతులు పత్తి, మిరప పంటలపై విసుగు చెంది బంతి పూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రైతులు పండించిన బంతి పూల కు మార్కెట్‌లో కేజీ 70రూ. దర పలుకుతుంది. దీంతో మండలంలో సుమారు 50ఎకరాల్లో బంతి సాగవుతుంది. దీంతో పాటు కొందరు రైతులు చామంతి సాగు చేస్తున్నారు.

కేజీబీవీలకు రూ.68 లక్షల 70 వేలు విడుదల

● సమగ్ర శిక్ష సైట్ ఇంజనీర్ బి.రాజు

రెంటచింతల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో మరమ్మతులతో పాటు కంప్యూటర్ గదుల నిర్మాణానికి రూ.68లక్షల 70వేలు విడుదలైనట్లు సమగ్ర శిక్ష సైట్ ఇంజనీర్ బి.రాజు చెప్పారు. బుధవారం మండలంలోని మిట్టగుడిపాడులో ని కేజీబీవీలో మరమ్మతులు చేయాల్సిన గదులను పరిశీలించారు. దీని మరమ్మతులకు రూ.5.30 లక్షలు, మాచర్ల కేజీబీవీకి రూ.3.30 లక్షలు, వెల్దుర్తిలోని కేజీబీవీకు రూ.60 లక్షల 10 వేల నిధులు విడుదల చేశారన్నారు. ఇక్క డ లైబ్రరీ, కంప్యూటర్, ఆర్ట్ అండ్ సైన్స్ ల్యాబ్ నిర్మించాల్సి ఉందన్నారు.

14 రేషన్ షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండలంలో 14 రేషన్ షాపులకు రెవెన్యూ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. దొడ్లేరు(ఓసీ), ఆవులవారిపాలెం (ఎస్సీ, పీహెచ్‌సీ), పెరికపాడు(ఓసీ ఉమెన్), ఉయ్యందన (బీసీ డీ ఉమెన్), అనంతవరం(బీసీ ఈ ఉమెన్), క్రోసూరు(బీసీ ఏ), బయ్యవరం (బీసీ ఏ), అందుకూరు(ఎస్టీ), పారుపల్లి(ఓసీ ఉమెన్), నాగవరం(బీసీ డీ), ఉయ్యందన(ఎస్సీ ఉమెన్), దొడ్లేరు(ఓసీ), 88 తాళ్ళూరు (ఓసీ), పీసపాడు (ఎస్సీ)లకు కేటాయించారు. డిసెంబరు 4వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ వాసురావు తెలియజేశారు. అభ్యర్థులకు రాత పరీక్ష డిసెంబరు 9, ఇంటర్వ్యూ 11న జరుగుతాయన్నారు.

ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీ

పిడుగురాళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీ ఆర్ భరోసా డిసెంబరు నెల పింఛను ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లను కూటమి ప్రభుత్వం చేస్తుంది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో నవంబరు 30వ తేదీనే ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కమిషనర్ శ్రీధర్, ఎంపీడీవో రామచంద్రరావులు తెలిపారు. పట్టణ, రూరల్ ప్రాంతాల్లో అన్నిరకాల సామాజిక పింఛన్ల పంపిణీ 30వ తేదీన సచివాలయ సిబ్బంది అందజేస్తారన్నారు.

29న జాబ్ మేళా

పిడుగురాళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. వివరాలకు 9492158153, 7842747682లను సంప్రదించాలన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుపై విస్తృత ప్రచారం

మాచవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాచవరంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండల ఉపాధ్యక్షుడు లఘువరపు వెంకటేశ్వర్లు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. టీడీపీ సభ్యత్వ నమోదు తీసుకోవటం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తూ అర్హులైన వారి నుంచి సభ్యత్వ నమోదును చేయిస్తున్నారు. వంద రూపాయలు పెట్టి సభ్యత్వం తీసుకుంటే ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు పార్టీ పరంగా ఇస్తారని తెలియజేశారు. అంతేగాకుండా సభ్యత్వం ఉన్నందు వల్ల వారి కుటుంబానికి అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయని తెలియజేస్తూ ప్రజల్లో ఉత్సాహాన్ని కల్పిస్తూ సభ్యత్వ నమోదును చేయిస్తున్నారు.

పిడుగురాళ్లలో....

పిడుగురాళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుర జాల నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు వేగ వంతం చేయాలని ఆదివారం పిడుగురాళ్లలో జరిగిన పార్టీ ముఖ్యుల సమీక్షలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణ, గ్రామాల వారీగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న యరపతినేని ఆదేశాలతో బుధవారం సాయంత్రానికి గురజాల నియోజకవర్గం వ్యాప్తంగా సభ్యత్వ నమోదు 18,000కు చేరుకుంది. పార్టీ బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, పట్టణ, గ్రామ కమిటీ నాయకులు ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం పుంజుకుంది.

రాజీవ్‌కాలనీ, వీరభద్ర కాలనీల్లో..

అచ్చంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని రాజీవ్‌కాలనీ, వీరభద్ర కాలనీల్లో టీడీపీ సభ్యత్వాలు వేగవంతంగా చేస్తున్నట్లు బీసీ నాయకుడు తిరువాయిపాటి ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి వివరిస్తూ ఇప్పటికి రెండు వందల సభ్యత్వాలు నమోదు చేసినట్లు తెలిపారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



గృహ నిర్మాణ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం గృహ నిర్మాణశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కన్నా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పక్కా గృహాల నిర్మాణ లక్ష్యాన్ని వంద రోజుల్లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పక్కా గృహాల నిర్మాణం మండలాల వారీగా ఎలా జరుగుతున్నాయనే అంశాలను ఆయన అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గానికి అధిక సంఖ్యలో పక్కా గృహాలు మంజూరయ్యేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో హౌసింగ్‌శాఖ డీఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు కన్నా అభినందనలు

సత్తెనపల్లి పట్టణంలోని నారాయణ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించటం అభినందనీయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. విద్యార్థులను బుధవారం తన కార్యాలయంలో అభినందించారు.

సమగ్ర సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

మాచవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాచవరంలోని జడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న సమగ్ర సర్వే కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఆయుష్మాన్ భారత్ ద్వారా రక్తహీనత, దేహ పరీక్షలు నిర్వహించి సమగ్ర నివేదికను పారదర్శకంగా తయారు చేయాలన్నారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ద్వారా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మూడు టీమ్‌లు జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహిస్తారన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆమె వైద్యాధికారులు ప్రసాదరావు, అన్వేష్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులకు రూ.60 లక్షలు విడుదల

రెంటచింతల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న రహదారి మరమ్మతులకు అదనంగా రూ.60 లక్షలు విడుదలైనట్లు ఆర్‌అండ్‌బీ డీఈ రమణయ్య, ఏఈఈ యూసఫ్‌లు చెప్పారు. బుధవారం మంచికల్లు రహదారిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రూ.40 లక్షలతో జరుగుతున్న మంచికల్లు రహదారికి అదనంగా రూ.15 లక్షలు, రెంటచింతల నుంచి రెంటాలకు రూ.15 లక్షలు, రెంటచింతల నుంచి గోలి మీదుగా జెట్టిపాలెం బైపాస్ రోడ్డు వరకు రూ.15 లక్షలు, సత్రశాల రహదారికి రూ.15 లక్షలు మొత్తంగా మరమ్మతుల నిమిత్తం రూ.1.78 కోట్లను రాష్ట్ర విపత్తుల నిర్వహణ నిధి నుంచి మంజూరు చేశారన్నారు.

ప్రభుత్వ బ్యాంకుల్లో మాత్రమే పొదుపు చేయాలి

ముప్పాళ్ళ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధిక వడ్డీలకు ఆశ పడకుండా ప్రభుత్వ బ్యాంకుల్లో మాత్రమే పొదుపు చేయాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ బీ సంతాప్ అన్నారు. రైతు సేవాకేంద్రంలో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో భారతీ రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు ఖాతాదారుల అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మేనేజర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ప్రభుత్వ బ్యాంకుల ద్వారానే లావాదేవీలు జరపాలని, ప్రధాన మంత్రి జీవన జ్యోతి సురక్ష ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, డిజిటల్ పేమెంట్స్‌పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ డీ రవి కుమార్, కొటక్ మహీంద్రా బ్యాంక్ మేనేజర్ టీవీఎస్ ప్రసాదు, లాం సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరరావులు ఆన్‌లైన్ మోసాల గురించి వివరించారు.

పెండింగ్ కేసుల్లో విచారణ వేగవంతం చేయాలి

నకరికల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసుల్లో విచారణను వేగవంతం చేయాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఆయన నకరిక ల్లు పోలీసుస్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. మండలంలోని శాంతి భద్రతల విషయం గురించి ఆరా తీశారు. వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.


బ్రహ్మనాయుడు విగ్రహం



మినీ మహాభారతం

- పోతుగడ్డలో పారిన వీరుల రక్తం
- యుద్ధభూమిలో ఆయుధ పూజ
- 30 నుంచి వీరారాధనోత్సవాలు

ద్వాపరయుగంనాటి మహాభారతాన్ని తలపించేది పల్నాటి యుద్ధం. ఈ యుద్ధంలో ఎందరో వీరులు పోరాడి అమరులయ్యారు. ఆనాటి యుద్ధంలో అశువులు బాసిన వీరుల గుండెచప్పుళ్లు ఇప్పటికీ వినబడుతూనే ఉన్నాయి. పదవీ వ్యామోహం, దాయాదుల వైరం, శైవ, వైష్ణవ సంఘర్షణల నేపథ్యంగా క్రీస్తు శకం 12వ శతాబ్దంలో పల్నాటి యుద్ధం జరిగింది. ఇక్కడ ఏటా జరిగే వీరారాధనోత్సవాల్లో కత్తులు నర్తిస్తాయి. పల్నాటి కథను హృద్యంగా ఆలపిస్తాయి, ఇక్కడ ఏ రాయిని చూసినా పల్నాటి పౌరుషం పలుకరిస్తుంది. ఆనాటి యుద్ధ విశేషాలను గుర్తు చేసుకుంటూ 900 ఏళ్లుగా ప్రతి ఏటా ఐదు రోజుల పాటు పల్నాటి వీరారాధనోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.


నాయకురాలు నాగమ్మ విగ్రహం

పల్నాటి యుద్ధం

కారంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30 నుంచి వీరారాధనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నలుమూల నుంచి యాత్రికులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఓ కథనం..

పల్నాటి యుద్ధానికి దారితీసిన పరిస్థితులు

పల్నాటి రాజ్యాన్ని అనుగురాజు పరిపాలిస్తున్న తరుణంలో ఒకసారి కారడవిలో నాగమ్మ ఆతిథ్యాన్ని స్వీకరించి సంతృప్తి చెందిన ఆయన, ఆమెకు కొంతకాలం రాజ్యాధికారం ఇవ్వడంతో పల్నాటి చరిత్రకు అంకురార్పణం జరిగింది. అనుగురాజు గతించి నలగామరాజు రాజుగా, బ్రహ్మనాయుడు మంత్రిగా పరిపాలనా బాధ్యతలు స్వీకరించిన సమయంలో తండ్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోమని నాగమ్మ కోరడంతో విధిలేక నలగామరాజు నాగమ్మకు రాజ్యాధికారం అప్పగించాడు. నాగమ్మ తనకు ప్రాప్తించిన విశేష అధికారాలతో బ్రహ్మనాయుడును దోషిగా చిత్రీకరించి నలగామరాజు సోదరుడు మలిదేవరాజును కారాగారంలో వేయించింది. బ్రహ్మనాయుడు మలిదేవరాజును విడిపించి మాచర్లలో రాజ్యాన్ని ఏర్పాటు చేసి సుభిక్షంగా పాలన సాగించారు. దీంతో, కన్నుకుట్టిన నాగమ్మ, మాచర్ల రాజ్యాన్ని కైవసం చేసుకోవాలని కుయుక్తులు పన్నుతుంది. నాగమ్మ చెప్పుడు మాటలు విని నలగాముడు ఆమె చేతిలో కీలుబొమ్మ అవుతాడు. జూద వ్యసనుడైన బ్రహ్మనాయుడును కవ్వించి గురజాలకు పిలిపించింది. మలిదేవ, బ్రహ్మనాయుడులను కోడి పందేలు ఆడేలా కవ్వించి కుతంత్రంతో వారిని ఓడించి అడవులకు పంపుతుంది. నిర్ణీత కాలం తర్వాత రాజ్యాన్ని, బ్రహ్మనాయుడు చేసిన విజ్ఞప్తిని మన్నించక దూతగా వచ్చిన అలరాజును చంపిస్తుంది. దీంతో, ఆగ్రహోదగ్రుడైన బ్రహ్మనాయుడు యుద్ధం అనివార్యమని తలచి మలిదేవరాజు తరఫున యుద్ధానికి దిగుతాడు. ఈ దాయాదులు యుద్ధభూమిగా కారంపూడిని ఎంచుకుని, పద్దెనిమిది రోజులు ఏకధాటిగా నాగులేటి ఒడ్డున పోరాటం చేస్తారు. ఈ పోరులో నాయకురాలు నాగమ్మ, బ్రహ్మనాయుడు చేతికి చిక్కగా స్త్రీ అనే కారణంగా ప్రాణబిక్ష పెట్టడంతో ఆమె పారిపోతుంది. యోధాను యోధులైన వీరులందరూ మరణిస్తారు. కన్నమదాసు, బాలచంద్రుడు, మలిదేవరాజు యుద్ధంలో వీరమరణం చెందుతారు. దీంతో, విరక్తి చెందిన బ్రహ్మనాయుడు రాజ్యాన్ని నలగామరాజుకు అప్పగించి గుత్తికొండ బిలంకు తపస్సు చేసేందుకు వెళ్లడంతో పల్నాటి యుద్ధం ముగుస్తుంది.


పల్నాటి యుద్ధ చిహ్నం

రక్తం కలిపిన అన్నపు ముద్దలు..

ఈ ఉత్సవాల్లో చివరిరోజైన 'కల్లిపాడు'ను రక్తం కలిపిన అన్నపు ముద్దలు పోతురాజు గుట్ట వద్ద ఆకాశంలోకి పీఠాధిపతి విసిరివేస్తారు. ఆ ముద్దలు శక్తులు (వీరులు) స్వీకరిస్తాయని నమ్మకం. ఈ తంతు ఆ నాటి నుంచి నేటి వరకు ఆనవాయితీగా వస్తోంది. నాడు వీరనాయకులు వాడిన ఆయుధాలను నాగులేటిలో స్నానమాచరింపజేసి అలంకరించి ఊరేగిస్తారు. బ్రహ్మన్న (పీఠాధిపతి) ఇచ్చిన తీర్థం తీసుకొని ఆ కొణతములు పోతురాజు గుట్టపై ఒరగడంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

ఐదురోజులు వీరారాధనోత్సవాలు

ఈ నెల 30 నుంచి వీరారాధనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు 30న 'రాచగావు', డిసెంబరు 1న 'రాయబారం', 2న 'మందపోరు', 3న 'కోడిపోరు', 4న 'కల్లిపాడు'తో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ప్రధానంగా పద్నాలుగు జిల్లాల నుంచి శిష్యులు, కన్నమనీయులు, పిన్నమనీయులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ఆనాడు బ్రహ్మనాయుడు గుత్తికొండ బిలానికి వెళ్తూ యుద్ధంలో మరణించిన వీరులకు ఉత్సవాలు నిర్వహించడానికి వీరాచార పీఠం ఏర్పరిచి పిడుగు వంశీయులైన బ్రాహ్మణులను పీఠాధిపతులుగా నియమించారు. వంశపారపర్యంగా వస్తున్న ఈ పీఠాధిపత్యంతో ఈ ఉత్సవాలను యువకుడు పిడుగు తరుణ్ చెన్నకేశవ అయ్య వారు నిర్వహిస్తారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, పీఠం నిర్వాహకుడు విజయకుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు.


పల్నాటి వీరుల ఆయుధాలు


యుద్ధభూమిలో దక్షిణం వైపున నిర్మించిన వీరుల సేవా స్థలం

బీచ్‌వాలీబాల్ పోటీలలో.. గుంటూరు జిల్లా ప్రతిభ

బాపట్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల సూర్యలంక తీరంలో రెండురోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి పాఠశాలల బీచ్‌వాలీబాల్ టోర్నమెంట్ సెలక్షన్స్ బుధవారంతో ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్నిజిల్లాలు నుంచి అండర్-14,17,19 సంవత్సరాల బాల బాలికల జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన ఈపోటీలలో అండర్-19 బాలికల విభాగంలో కృష్ణాజిల్లా, విజయనగరం జిల్లాలు ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించాయి. అండర్-19 బాలుర విభాగంలో ఈస్ట్ గోదావరి ప్రథమస్థానం, కృష్ణాజిల్లా ద్వితీయ స్థానం, అండర్-17 బాలికల విభాగంలో కడప ప్రథమ స్థానం, గుంటూరు ద్వితీయ స్థానం, అండర్-17 బాలుర విభాగంలో గుంటూరు ప్రథమస్థానం, శ్రీకాకుళం ద్వితీయ స్థానం, అండర్ -14 బాలుర విభాగంలో గుంటూరు జిల్లా ప్రథమ స్థానం, కర్నూలు జిల్లా ద్వితీయ స్థానం, అండర్-14బాలికల విభాగంలో కడప ప్రథమస్థానం, గుంటూరు ద్వితీయ స్థానం సాధించాయి. గెలుపొందిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం, గుంటూరుజోన్ ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరి ఎస్‌కె.కరిముల్లాలు బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రబీచ్ వాలీబాల్‌జట్లు ఇక్కడ ఎంపిక చేయటం జరిగింది. వీరు డిసెంబరు నెలలో జాతీయస్థాయి పోటీలు ఒరిస్సా రాష్ట్రంలోని పూరిలో జరుగు పోటీలలో పాల్గొంటారని సెక్రటరి ఎస్‌కె.కరిముల్లా తెలిపారు.


బీచ్‌వాలీబాల్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, బహుమతులను అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం తదితరులు

ఏపీలో వ్యవసాయ పరిశోధనలను ప్రోత్సహించండి: ఎంపీ లావు

న్యూఢిల్లీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పరిశోధనలను ప్రోత్సహించాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. బుధవారం వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలను ఆయన పార్లమెంట్ దృష్టికి తీసుకొచ్చారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పుట్టినిల్లు అయిన ఆంధ్రప్రదేశ్‌లో లోతైన వ్యవసాయ పరిశోధనలకు పెట్టుబడులు పెట్టాలని కేంద్రానికి ప్రతిపాదించారు. వ్యవసాయంలో వినూత్న పద్ధతులు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధిక దిగుబడి ఇస్తున్న పంటల్లో సూక్ష్మపోషక సాంద్రత గణనీయంగా తగ్గుతుందని తేలిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన పంట దిగుబడిని ప్రోత్సహించాలన్నారు.

దారి దోపిడీ దొంగలకు ఐదేళ్ల జైలు, జరిమానా

యడ్లపాడు, నరసరావుపేట లీగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండల పరిధిలో దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు దొంగలకు ఐదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ నరసరావుపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎ పూర్ణిమ బుధవారం తీర్పునిచ్చారు. ఎస్‌ఐ వి బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... 2021 డిసెంబరు 6న లింగారావుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మద్దు వీరయ్య, ప్రసన్న దంపతులు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న బంధువులను పరామర్శించి రాత్రి 8.30 గంటల సమయంలో గ్రామానికి వస్తుండగా బోయపాలెం-లింగారావుపాలెం మార్గంలోని చెరువు సమీపంలో గుర్తు తెలియని దుండగులు కర్రలతో దాడిచేసి వారివద్ద 3.5గ్రాముల బంగారం, రూ.2,300 నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కుని వదిలివేశారు. మరి కొంత సమయానికి అదే కాలనీకి చెందిన మద్దు అంకమ్మ, నర్సమ్మలు రాగా వారిపై కూడా దాడిచేసి సెల్‌ఫోన్, చెవి కమ్మలు, జూకాలు, గొలుసు లాక్కుని తీవ్రంగా కొట్టారు. సంఘటన జరిగిన మరుసటి రోజు రాత్రి 9 గంటల సమయంలో చెంఘీజ్‌ఖాన్‌పేట-సొలస మార్గంలో ద్విచక్రవాహనంపై కుమారుడు ధనుష్‌తో కలసి వెళుతున్న సాగి నాగమ్మలను ముసుగులు వేసుకున్న దుండగులు కర్రలతో దాడిచేసి పొలంలోకి లాక్కెళ్ళి వారి వద్ద ఉన్న 3.75 సవర్ల బంగారు గొలుసు చెవి పోగులు, ఉంగరం, వెండి పట్టీలు లాక్కున్నారు. కొద్ది సేపటికే అదే గ్రామానికి చెందిన పొనుగుబాటి వీరాంజనేయులు తాళ్లూరిలోని ఉంటున్న తన అత్త గోరంట్ల అంజమ్మను ద్విచక్రవాహనంపై తీసుకుని వస్తుండగా అతనిపై కూడా దాడిచేసిన దుండగులు సెల్‌ఫోన్, రూ.1,500 నగదు, అంజమ్మ వద్ద ఉన్న చెవి కమ్మలు, ముక్కుపుడక లాక్కున్నారు. అప్పట్లో ఈ సంఘటనలు సంచలనం కలిగించాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో నిందితులైన నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు గ్రామానికి చెందిన ఆకుల లింగమయ్య, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం అమ్మవరం గ్రామానికి చెందిన దాసరి ఓబులేసు, నంద్యాలకు చెందిన చిన్న ఇండ్ల రమణయ్యతో పాటు మరో ఐదుగురిని అరెస్టు చేశారు. వారిపై కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. బెయిల్‌పై వెళ్లిన వారిలో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారు. మిగతా ముగ్గురు నిందితులకు గతంలో ఓ కేసులో 20 సంవత్సరాలు శిక్ష పడింది. వారు ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైల్లో ఉన్నారు. వారిపైనే పై రెండు నేరాలు కూడా రుజువ్వడంతో ఒక్కొక్క కేసులో ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాలు శిక్ష మొత్తాన్ని ఏకకాలంలో అనుభవించేలా న్యాయాధికారి తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ బుచ్చిదంతాచారి నిర్వహించారు. దోపిడీలకు పాల్పడిన వారంతా వలస కూలీలుగా యడ్లపాడు మండలానికి వచ్చి పగలు పనులకు వెళ్ళేవారని, రాత్రిళ్ళు దోపిడీలకు పాల్పడే వారని ఎస్‌ఐ వివరించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో రేణుకకు బంగారు పతకం

పోటాపోటీగా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలు


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు

పెదకాకాని, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న సౌత్ వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలో వర్సిటీ విద్యార్థిని రేణుక బంగారు పతకం సాధించింది. బుధవారం జరిగిన పోటీల్లో 76 కేజీల విభాగంలో మొత్తం 205 కేజీలు బరువు ఎత్తి రేణుక ప్రథమ స్థానంలో నిలిచినట్లు పోటీల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పీపీఎస్ పాల్‌కుమార్ తెలిపారు. 71 కేజీల విభాగంలో ఆంధ్ర యూనివర్సిటీ క్రీడాకారిణి సనపత్తి పల్లవి బంగారు, ఏఎన్‌యూ విద్యార్థిని బి.నాని వెండి, మంగళూరు యూనివర్సిటీ క్రీడాకారిణి ఎం.తనుషా కాంస్య పతకాల్ని పొందారు. 64 కేజీల విభాగంలో భారతీ విద్యాపీట్ యూనివర్సిటీకి చెందిన కామ్ టీ హిమాలినగేష్ బంగారు, శివాజీ యూనివర్సిటీ క్రీడాకారిణి మోహితే భూమిక రాజేంద్ర వెండి, అన్నామలై యూనివర్సిటీ విద్యార్థిని కౌశికల్ కాంస్య పతకాల్ని కైవసం చేసుకున్నారు. 59 కేజీల విభాగంలో భారతీ విద్యాపీట్ యూనివర్సిటీకి చెందిన క్రీడాకారిణి సాక్షిరమాలే బంగారు, భారతీయార్ యూనివర్సిటీ క్రీడాకారిణి కనికశ్రీ వి.ఆర్ వెండి, జేఎన్టీయూ కాకినాడ క్రీడాకారిణి కందుకూరి హైమావతి కాంస్య పతకాల్ని సాధించినట్లు పాల్ కుమార్ తెలిపారు. వర్సిటీ వీసీ, పోటీల నిర్వాహక కమిటీ ఛైర్మన్ ఆచార్య కే. గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం పతకాలు పొందిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ టీం చీఫ్ బడేటి వెంకట్రామయ్య, అధ్యాపకులు డాక్టర్ డి.సూర్యనారాయణ, డాక్టర్ యిన్నయ్య, డాక్టర్ రామ్మోహనరావు లు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌గా నంద

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయ విభాగంలో అతిథి అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పర్చూరు కుమారి నంద సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలో బంగారు పతకం సాధించారు. బుధవారం ఆమెను వీసీ ఆచార్య కె.గంగాధరరావు అభినందించారు. నేషనల్ ఈవెంట్‌లో కూడా రాణించి మరిన్ని పతకాలు సాధించాలని రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఆమెకి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవిభాగాధిపతి ప్రొఫెసర్ ఎల్. జయశ్రీ, అతిథి అధ్యాపకులు డాక్టర్ ఎస్.సతీష్, ఎస్ చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ పి.శివరాం, చెన్నారావు, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, అభిషేక్, డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎన్ రాధిక, డాక్టర్ కిషోర్, డాక్టర్ జి.సతీష్‌కుమార్, శ్రీరామ్ తదితరులు ఈ అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాధే బరువాయే

నారు పోసిన వాడు నీరు పోయక పోతాడా అన్న ధీమా గుంటూరు ప్రభుత్వాసుపత్రి సిబ్బందిలో కనిపిస్తుంది. అసలే ప్రాణం ఉంటుందో పోతుందో అన్న బాధలో ఆసుపత్రికి వచ్చే వారికి అక్కడ మరిన్ని బాధలు తప్పడం లేదు. అయిన వారిని కాపాడుకునేందుకు రక్త సంబంధీకులే స్ట్రెక్చర్‌లను నెట్టుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రిలో చేరిన తరువాత కూడా ఆ పరీక్ష ఈ పరీక్ష అంటూ వార్డులకు తీసుకు వెళ్లేందుకు బంధువులే ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అక్కడ ఉన్న వార్డు బాయ్‌లు ఏమయ్యారో.. ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి.

-(గుంటూరు, ఆంధ్రజ్యోతి)



నేటి వరకే క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకారం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ సమ్మరి రివిజన్-2025లో భాగంగా సాధారణ ఓటర్లు తమ క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఈ నెల 28వ తేదీ సాయంత్రం వరకు దాఖలు చేయొచ్చని ఈఆర్‌వో ఎన్ఎస్‌కే కాజావలి తెలిపారు. గత నెల 29వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాని ప్రచురించడం జరిగిందని, ఆ రోజు నుంచే క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తున్నామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కలిపి దాదాపుగా 15 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఈ నెల 16, 17, 23, 24 తేదీల్లో అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోల ద్వారా స్పెషల్ క్యాంపెయిన్ డేలను కూడా నిర్వహించామని చెప్పారు. గురువారం సాయంత్రం వరకు దాఖలైన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబరు 24వ తేదీ లోపు పరిష్కరించి ఓటర్ల జాబితాను ఆరోగ్యవంతంగా రూపొందిస్తామని పేర్కొన్నారు. తుది ఓటర్ల జాబితా 2025 జనవరి 6వ తేదీన ప్రచురించడం జరుగుతుందన్నారు. దీని దృష్ట్యా ఇంకా ఎవరైనా క్లెయిమ్‌లు పెట్టుకోదలచిన వారు గురువారం సాయంత్రం లోపు దాఖలు చేసుకోవచ్చని సూచించారు. ఇది సాధారణ ఓటర్లకు సంబంధించిన ప్రక్రియ అని, దీనికి పట్టభద్రుల ఓటర్ల క్లెయిమ్‌లకు సంబంధం లేదన్నారు.

అడుగడుగునా.. వసూళ్లు

మిర్చి ఎగుమతిదారులు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు)కు ప్రత్యామ్నాయం చూసుకొంటున్నారు. హమాలీలు మొదలుకొని లారీ యజమానుల వరకు సిండికేట్లుగా మారి అలవికాని ఛార్జీలు వసూలు చేస్తుండటమే ఇందుకు మూల కారణం. ఇప్పటికే కొంతమంది ఎక్స్‌పోర్టర్లు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం మార్కెట్‌కి వెళ్లి అక్కడ మిర్చిని కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు. మరికొందరు పల్నాడు జిల్లాలోని దాచేపల్లి ఏఎంసీకి వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. దీని వలన ఇప్పటికిప్పుడు మార్కెట్ కమిటీ ఆదాయంలో వ్యత్యాసం పెద్దగా కనిపించకపోయినా దీర్ఘకాలంలో భారీగానే రాబడికి చిల్లు పడుతుందన్న అభిప్రాయం వ్యకమవుతున్నది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ అధికారులు తేరుకోకపోతే ఆ తర్వాత చర్యలు తీసుకొన్నా ఎలాంటి ఉపయోగం ఉండదు.

- మిర్చి ఎగుమతిదారుల పక్కచూపులు
- గుంటూరు యార్డులో సిండికేట్‌లతో వేగలేకే ప్రత్యామ్నాయం
- ఖమ్మం, దాచేపల్లి యార్డుల్లో కొనుగోళ్లపై ఆసక్తి
- ఇదే పరిస్థితి కొనసాగితే జీఏంసీ ఆదాయానికి గండి పడినట్లే

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): మిర్చి ఎక్స్‌పోర్టింగ్‌కు మిర్చియార్డు పెట్టింది పేరు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా మిర్చి పండికే కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి కూడా రైతులు ఇక్కడికే వస్తుంటారు. ఇందుకు కారణం సరుకు అమ్ముడవగానే పైకం చేతిలో పడుతుంది. గతంలో పెద్దగా కూలీ ఛార్జీలు లేకపోవడం వలన ధర కూడా రైతుకు గిట్టుబాటు అయ్యేది. అయితే కాలక్రమంలో ఇక్కడ ప్రతీ వ్యవస్థలో సిండికేట్లు పుట్టుకొచ్చాయి. దొడ్డి కాపలా, కాటాలు, మచ్చు, లారీలోకి టిక్కీలు లోడింగ్ చేసి మోకులు కట్టినందుకు మరే ఇతర మార్కెట్లలో లేని ఛార్జీలను ఇక్కడ వసూలు చేస్తున్నారు. ఇవి చాలదన్నట్లుగా గుమాస్తా మామూళ్లు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ రైతు తీసుకొచ్చిన మిర్చికి ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేయకుండా ఎగుమతిదారులకు ప్రతిబంధకాలుగా మారాయి. ఇక లారీ రవాణ ఛార్జీలు కూడా ఇతర ప్రాంతాలతో పోల్చితే చాలా ఎక్కువ. ఒక మిర్చి టిక్కీ కాటా వేసినందుకు దాదాపుగా రూ. 5కి ఛార్జీ పెంచమని వేమెన్‌ల సిండికేట్ కోరుతున్నది. లారీకి మిర్చి టిక్కీలు ఎత్తి మోకులు కట్టినందుకు దాదాపుగా రూ. 6 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. అయితే ఈ పనిని సక్రమంగా చేయడం లేదు. లారీ హైవే మీదకు వెళ్లిన తర్వాత అక్కడ తిరిగి మోకులను బిగించాల్సి వస్తున్నది. ఇందుకు దాదాపుగా రూ. 1500లకు పైగా ఖర్చు అవుతున్నది.

దొడ్డి కాపలా, దిగుమతి, ఎగుమతి కూలీలు కూడా మోయలేని భారంగా మారాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మచ్చుకాయల రూపంలో ఒక్కో లాట్ నుంచి కేజీకి పైగానే మిరపకాయలను తీసుకొంటున్నారు. ఒక లారీ ఎక్స్‌పోర్టింగ్‌కు పెడితే ఎగుమతిదారుడి గుమాస్తా మామూలు కింద రూ. 3 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. ఇవ్వకపోతే బిల్లులు కొట్టకుండా జాప్యం చేస్తున్నారు. అలానే మిర్చియార్డులో సూపర్‌వైజర్ల మామూళ్లు బహిరంగ రహస్యమే. ఇలా చూసుకొంటే సిండికేట్ల కారణంగా ఒక లారీని ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తే ఇతర మార్కెట్లతో పోల్చితే దాదాపుగా రూ. 30 వేలకు పైగా వ్యత్యాసం వస్తున్నదని ఎక్స్‌పోర్టర్స్ చెబుతున్నారు. దీని వలనే తాము ఖమ్మం, దాచేపల్లి మార్కెట్ కమిటీల్లో మిర్చి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. దాచేపల్లి ఏఎంసీ నుంచే ఈ ఏడాది 6 లక్షలకు పైగా మిర్చి టిక్కీలు ఎగుమతి అయినట్లు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. ఖమ్మం మార్కెట్ నుంచి 20 లక్షలకు పైగా టిక్కీలు ఎగుమతి అయ్యాయని తెలిపాయి. దీనివలన గుంటూరు యార్డుకు రావాల్సిన ఆదాయానికి క్రమక్రమంగా గండి పడటం ప్రారంభించింది. ఈ కారణంగానే మిర్చియార్డు ఆదాయం ఏటా రూ. 100 కోట్ల మార్కెట్ ఫీజుకు మించడం లేదు. వాస్తవానికి ఇంతకంటే కనీసం మరో 40 శాతం పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా సిండికేట్ల కారణంగా గండి పడుతున్నది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ అధికారులు మిర్చి ఎగుమతులకు అనుకూలమైన వాతావరణం కల్పించకపోతే పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇవేకాకుండా కొంతమంది కమీషన్ వ్యాపారస్తులు ఎగుమతిదారులకు నమ్మకంగా కుచ్చుటోపీ పెడుతుండటంతో ఈ మోసాలతో వేగలేమని వేరేదారులు వెతుక్కొంటున్నారు.



పల్నాడు వార్తలు

నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఇద్దరి బైండోవర్

ఈపూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న కేసులో ఇద్దరిపై కేసు నమోదుచేసి తహసీల్దారు వద్ద బైండోర్ చేసినట్లు ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డీ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. రొంపిచర్ల మండలం కర్లకుంటకు చెందిన నరసింహారావు, విప్పర్లపాలెంకు చెందిన రామిరెడ్డి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ఈపూరు మండలం అగ్ని



గుండాల సమీపంలోని అడవిలో నాటు సారా తయారీ కేంద్రాల స్థావరాల కోసం గాలింపు చేశారు.

అనుమతులు లేని మద్యం పట్టివేత

శావల్యాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శావల్యాపురంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని ఏడు బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శావల్యాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిపారు. శ్రీనివాసరావుతో పాటు ఇటీవల బెల్టుషాపులు నిర్వహిస్తూ పట్టుబడ్డ నిందితుల్ని కూడా వినుకొండ తహసీల్దార్ సురేష్ వద్ద హాజరు పరచి బైండోవర్ చేశారు. ఆయనతోపాటు ఎక్సైజ్ ఎస్ఐ వినీల, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడికి జరిమానా

నరసరావుపేట లీగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో నేరం రుజువు అవ్వడంతో నిందితుడు ఫిరంగిపురం మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన వేశంగిణిరాజుకు రూ.1000 జరిమానా విధిస్తూ స్థానిక రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయ అధికారి టి ప్రవళిక బుధవారం తీర్పు వెలువరించారు. నిందితుడు వేశంగిణి రాజు 2019 జనవరి 15న ఫిరంగిపురంలో ఓ మద్యం దుకాణంలో అదే గ్రామానికి చెందిన సందీప్‌రాజ్‌పై స్వల్ప వివాదం నేపథ్యంలో దాడిచేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడుని అదుపులోకి తీసుకొని కోర్టులో అభియోగపత్రం దాఖలుచేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైవిధంగా కోర్టు తీర్పు ఇచ్చింది.

ఎయిడ్స్‌పై అవగాహనకు ఆర్టీసీ బస్టాండ్‌లో స్టాల్

నరసరావుపేట లీగల్, నవంబర్ 27, ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సూచనల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎడిషన్ నివారణ నియంత్రణ విభాగాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కోసం స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ బుధవారం తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కలిగించడానికి ఈ స్టాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

భారత ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఎంఎస్ఎంఈ రంగం

● మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి

నరసరావుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ భాతరదేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన రంగంగా మారిందని ఎంఎస్ఎంఈ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి అన్నారు. బుధవారం స్థానిక పెట్లూరివారిపాలెం ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేసీ చౌదరి మాట్లాడుతూ యవత ఎంఎస్ఎంఈ రంగంలో అవకాశాలను అన్వేషించి, తమ వ్యాపార వ్యూహాలు ప్రారంభించుకోవచ్చునన్నారు. ముందుగా కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. వ్యాపార మార్గదర్శకతను అందించేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నలుగురికి ఏఎస్ఐలుగా ప్రమోషన్

చిలకలూరిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలో నలుగురు హెడ్ కానిస్టేబుళ్ళకు ఏఎస్ఐలుగా ప్రమోషన్ లభించింది. యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుళ్ళుగా ఉన్న ఎన్ కోటేశ్వరరావు, ఎం వెంకయ్య, యు గోవిందరాజు, నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌కు చెందిన షేక్ ఖాసింసాహెబ్‌లకు ఈ మేరకు ప్రమోషన్ ఇస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా వీరిని చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బనాయుడు అభినందించి శాలువాలతో సత్కరించారు.

మిట్టపల్లి స్పిన్నింగ్ మిల్లులో కంటి వైద్య శిబిరం

నరసరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యనమదలలోని మిట్టపల్లి స్పిన్నర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి), నేత్రాలయ ఐ కేర్ (తెనాలి) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జనరల్ మేనేజర్ శశిధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నేత్రాలయ ఐ కేర్ వైద్యులు షేక్ సైదా, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.బుల్లిబాబు, మిల్ పర్సనల్ అధికారి నరసింహ నాయక్ హాస్పటల్ సిబ్బంది సుభాని, భవాని, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతా యాప్‌పై అవగాహన

నరసరావుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, ఫేస్‌బుక్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ కే ప్రియాంక అన్నారు. బుధవారం స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మహిళా పోలీస్ ఉమెన్స్ సేఫ్టీ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఎం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, మహిళా పోలీస్ శ్రావ్య, జ్యోతి, సౌజన్య, కళాశాల ఇన్‌చార్జి షేక్ సర్దార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని గృహ నిర్మాణ శాఖ అధికారులు


రొంపిచర్లలోని గృహ నిర్మాణ శాఖ అధికారి కార్యాలయం

● సమాచారం దొరక్క ఇబ్బందిపడుతున్న ప్రజలు

రొంపిచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లలో గృహ నిర్మాణ శాఖ అధికారి కార్యాలయం ఉంది. ఐతే అధికారులు, సిబ్బంది ఎవ్వరూ అందుబాటులో లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో అధికారి లేదా సిబ్బంది ఇక్కడ అందుబాటులో ఉండే వారు. గృహ నిర్మాణశాఖకు సంబంధించిన సమస్యలు ఉంటే ఎవరిని సంప్రదించాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గృహాలకు సంబంధించిన నిధులు మంజూరు చేస్తుండటంతో కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు కనీస సమాచారం అందేలా చూడాలని కోరుతున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం: ఎంపీడీవో

ఈపూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని ఎంపీడీవో కే ప్రభాకరరావు అన్నారు. ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఈపూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చిన్నతనంలోనే పెళ్ళి చేయడం వలన వచ్చే నష్టాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చిన్నమ్మాయి, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


సాతులూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఐసీడీఎస్ సిబ్బంది

సాతులూరులో....

నాదెండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహం చట్ట రీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కే పద్మ అన్నారు. మండలంలోని సాతులూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలల సహకారాన్ని దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది షేక్ అఖిల, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహరహిత భారతదేశంపై ప్రతిజ్ఞ

నరసరావుపేట లీగల్ నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ రహిత భారతదేశం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశానుసారం బుధవారం పట్టణంలో బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు స్థానిక శంకర్ భారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తో, వివిధ శాఖల సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ విద్యాశాఖ, వైద్య, రెవెన్యూ దిశ డీఎస్పీ వివిధ శాఖల సిబ్బంది స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, శంకరభారతీపురం జడ్పీ ఉన్నత పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని రెడ్డి నగర్‌లోని బీసీ కళాశాలల విద్యార్థుల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ప్రధాన సీనియర్ సివిల్ న్యాయ అధికారి కే మధుస్వామి బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహ రహిత భారతదేశం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘఉపాధ్యక్షురాలు అమూల్య, పారా లీగల్ వలంటీర్లు, న్యాయవాదులు, రెండో పట్టణ ఎస్ఐ హరిబాబు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి మణికుమారి విద్యార్థులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం పోతవరంలో ఉన్న కస్తూరిబా బాలికల హైస్కూల్‌లో బుధవారం బాల్య వివాహాలపై కలిగే అనర్థాలపై అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్యవివాహాల వలన జరిగే నష్టాల గురించి బాలికలకు వివరించారు. బాల్య వివాహ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలపడానికి తామంతా కృషి చేస్తామని బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ షేక్ అస్రీఫూన్, పంచాయతీ కార్యదర్శి వి.తులసీదాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సామ్రాజ్యం, భూలక్ష్మి, మహిళా పోలీస్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.


ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును సత్కరిస్తున్న విశ్వసాయి జూనియర్ కళాశాల నిర్వాహకులు

కన్నతల్లిని, జన్మభూమిని మరువవద్దు

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కన్నతల్లిని, జన్మభూమిని మరవరాదని విద్యార్థులు చదువుతోపాటు సంస్కారాన్ని నేర్చుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. కారంపూడి రోడ్డులోని బ్రహ్మనాయుడు కల్యాణ మండపంలో విశ్వసాయి జూనియర్ కళాశాల 7వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవానికి హాజరైన జీవీ ఆంజనేయులుకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో జీవీ మాట్లడుతూ సంస్కారవంతమైన విద్యను కళాశాలల యాజమాన్యం విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యలో రాణించాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థినీ, విద్యార్థులకు జీవీ, మక్కెన చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, న్యాయవాది అనగ గోపాలకృష్ణ, కూటమి నాయకులు నిశంకర శ్రీనివాసరావు, మేడం రమేష్, రాయల్ నాగశ్రీను, టీవీ నాగేశ్వరరావు, కౌన్సిలర్ షకీల, పెండేల శ్రీనివాసరావు, గాలి శ్రీనివాసరావు, భాగవతుల రవికుమార్, పీవీ సురేష్, సీపీఐ నాయకులు మారుతీవరప్రసాద్, పాఠశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ, ప్రిన్సిపాల్ శ్రీవల్లి పావని తదితరులు పాల్గొన్నారు.

మాలధారణ స్వాములకు సద్ది వితరణ

వినుకొండ: అయ్యప్పమాల వేసుకున్న స్వాములు ధర్మాన్ని ఆచరించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయుల సూచించారు. పట్టణంలోని పాత శివాలయంలో మాలధరణ చేసిన స్వాములకు సద్ది వితరణ కార్యక్రమం బుధవారం చేపట్టారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం స్వాములకు అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఖర్చులతో స్వాములకు సద్ది (అన్నదానం) ఏర్పాటుచేస్తున్న నిర్వాహకులకు ప్రత్యేకంగా అభినందించారు.

టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కోరారు. బుధవారం నరసరావుపేట పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉంటే ప్రతి కార్యకర్తకూ ధైర్యం, భరోసా ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం కావటంతో పాటు, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్స్, క్లస్టర్, యూనిట్ పట్టణం నాయకులు పాల్గొన్నారు.

నూజెండ్ల మండలంలో పొలం పిలుస్తోంది

నూజెండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెం, తలార్లపల్లి, వీ అప్పాపురం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా వరి, మొక్కజొన్న, కంది, మిరప పైర్లను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశమై వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుగుణాబేగం, ఏఈవో ఎలిషా, గ్రామ సహాయకులు పీ అశోక్, వీ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సైన్స్ ఫెయిర్‌లో రావులాపురం విద్యార్థుల ప్రతిభ

బొల్లాపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్వసాయి జూనియర్ కళాశాల వినుకొండ వారు ఈ నెల 23వ తేదీన నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో బొల్లాపల్లి మండలం రావులాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వాకడావత్ బాలాజీ నాయక్, బాణావత్ విజయ్‌బాబు నాయక్, కొడితే పవన్ కుమార్ నాయక్‌లు తయారుచేసిన పంట రక్షణ కోసం, బోర్‌వెల్ మోడల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు సైన్స్ మోడల్స్ తయారు చేయటం ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు. బుధవారం వినుకొండలో జరిగిన కళాశాల కార్యక్రమంలో విద్యార్థులకు షీల్డ్, నగదు బహుమతులను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను సైన్స్ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, బాలాజీ, సుభాషిణి, మోహనరావు తదితరులు అభినందించారు.

మహంకాళి అమ్మవారికి నాగాభరణం బహూకరణ

నరసరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానానికి నరసరావుపేట పట్టణ వాస్తవ్యులు కంభంపాటి దరియావలి, నాగమణి, కుటుంబ సభ్యులు సుమారు రెండు లక్షల రూపాయలు విలువగల పంచ శిరస్సుల నాగభరణ జ్వాలా కిరీటాన్ని అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ఆలయం పునఃనిర్మాణంలో భాగంగా భక్తులు విరాళాన్ని అందజేస్తున్నారని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్ మాధవీదేవి తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రదక్షిణ మండపానికి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పనులు ప్రారంభిస్తున్నారన్నారు. భక్తులు అమ్మవారి ఆలయనిర్మాణంలో భాగస్వాములవ్వాలని కార్య నిర్వహణ అధికారిని. ఎస్.మాధవీదేవి తెలిపారు.


ఆలయ అధికారికి పంచ శిరస్సుల నాగాభరణ జ్వాలా కిరీటాన్ని అందజేస్తున్న దాతలు

మురికిపూడి హైస్కూల్‌లో వైద్య శిబిరం

చిలకలూరిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సేవా సంస్థ ఒయాసిస్ ఆధ్వర్యంలో మండలంలోని మురికిపూడి శారదాంబ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఒయాసిస్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ళ జయమ్మ సేవ్ ద యూత్, సేవ్ ద ఫ్యూచర్ అనే అంశం గురించి వివరించి డ్రింక్స్, డ్రగ్స్, స్మోకింగ్ కి దూరంగా ఉండాలని ప్రమాణం చేయించారు. సైక్రియాటిస్ట్ డాక్టర్ మధులత మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా చదువుకోవాలని, సోషల్ మీడియాని సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. శిబిరంలో వైద్యులు కోటేశ్వర్, మైథిలిరాణి, అనిత, ప్రఫుల్లాదేవి, తేజస్విని విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి 550 మంది పిల్లలకు రూ.25 వేల విలువ కలిగిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయ, పి.సంధ్య, హెచ్ఎం ధనలక్ష్మి, కొండలరావు పూర్ణయ్య, నాగూర్ పాల్గొన్నారు.


శిబిరంలో మాట్లాడుతున్న వయాసిస్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ళ జయమ్మ

ఇక్కుర్రులో పంటలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు

నరసరావుపేట రూరల్, నవంబరు 27: (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇక్కుర్రులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి వరి పంట పరిశీలించి అగ్గి తెగులు ఉన్నట్లు గుర్తించారు. వేప గింజల కషాయ తయారీ గురించి రైతులకు తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ, మండల వ్యసాయాధికారి వి.నరేంద్ర బాబు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, పేరయ్య, నరసరావుపేట రవితేజ, హరి వినయ్‌కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.


ఆర్‌డబ్ల్యూఎస్ ఎన్ఎస్‌పీ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్లే నీటి సమస్యలు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదు సంవత్సరాల్లో వైపీపీ ప్రభుత్వ నిర్వాకంతో జల జీవన్ మిషన్ నిధులను ఉపయోగించక గ్రామాల్లో నీటి సమస్యలు ఎక్కువయ్యాయని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఉదయం ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఎస్‌పీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో డిసెంబరు 5న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిలకలూరిపేట మండలంలోని పసుమర్రులో చెరువును ఆరుకోట్ల నిధులతో పూర్తి చేసినప్పటికీ గ్రామంలో నీటి సరఫరా జరగటం లేదని, నీటి సరఫరా సమస్యలు నిరంతరం ఎందుకు వస్తున్నాయని, వెంటనే చెరువుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో రూ.30 కోట్ల నిధులతో 64 పనులకు సంబంధించి జలజీవన్ మిషన్ గ్రాంట్ కింద విడుదలైన పనుల పురోగతి వివరాలు ప్రత్తిపాటి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 18 పనులు పూర్తి కాగా ఐదు పనులు జరుగుతున్నాయని, 41 పనులు ఇప్పటివరకు మొదలు కాలేదని అధికారులు తెలిపారు. ఇకమీదట ప్రణాళికాబద్ధంగా పనులన్నీ ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి పూర్తిచేయాలని ప్రత్తిపాటి అధికారులకు సూచించారు.

మిద్దెబావి స్థలాల్లో రెవెన్యూ అధికారుల సర్వే

● అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

వినుకొండ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిద్దెబావి స్థలాల్లో అక్రమార్కులు భరతం పట్టేందుకు రెవెన్యూ అధికారులు నడుం బిగించారు. గత కొంతకాలంగా కొందరు అక్రమార్కులు నిరుపేద స్థలాలనే అడ్డాగా చేసుకొని పేదలతో చెలగాటమాడుతున్నారు. నకిలీ పట్టాలను సృష్టించి నిరుపేదలపై దౌర్జన్యంతో ఇంటి స్థలాలను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపడుతునారు. ఈ విషయంపై పదేపదే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు రావడంతో ఎట్టకేలకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గుట్టుచప్పుడు కాకుండా బుధవారం 32మంది సిబ్బందితో ఏకకాలంలో 927 ప్లాట్లను సర్వే నిర్వహించారు. ఇళ్ళు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారి వివరాలను సేకరించి వాస్తవ పరిస్థితుల పై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తహసీల్దార్ సురేష్ నాయక్ తెలిపారు. స్థలాలు ఆక్రమణకు గురైనట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


నాదెండ్లలో హాజరు శాతాన్ని పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించాలి

● డీఈవో చంద్రకళ

నాదెండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో డిసెంబరు 7వ తేదీన మెగా పేరెంట్స్ సమావేశాలను నిర్వహించాలని జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ సూచించారు. మండలంలోని నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడుతూ కమిటీలు వేసుకొని సమావేశాలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశాలకు ఎస్ఎంసీ కమిటీ సభ్యులతో పాటు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వాలన్నారు. ప్రతి విద్యార్థి చదవటం, రాయటం అలవర్చుకొనే విధంగా బోధన చేయాలన్నారు. దీర్ఘకాలంగా గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా చదువుకోవాలని విద్యార్థులను కోరారు. ఆమెతో ఇన్‌చార్జ్ హెచ్ఎం బీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కే రెడ్డెయ్య తదితరులు ఉన్నారు.

పాఠశాలలో డీవైఈవో వార్షిక తనిఖీ

నరసరావుపేట కల్చరల్, నవంబర్, 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నరసరావుపేట ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాల రావు బుధవారం వార్షిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఉపాధ్యాయుల బోధనను, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనాన్ని, చిక్కీల పంపిణీ, మరుగుదొడ్ల నిర్వహణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులను గ్రేడులుగా విభజించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. తనిఖీలో సబ్జెక్టు పరిశీలకులుగా జేసుదాసు, ఎస్పీ. మొహిద్దీన్ సాహెబ్, ఎస్.శ్రీనివాసరావు, ఎన్.రామకృష్ణారెడ్డి, టీవీహెచ్ రఘురామ్, బ్యూలా హోసన్నా, చిరంజీవి, వెంకట్, రాజశేఖర్, రామచంద్రకుమార్‌లు పాల్గొన్నారు. తనిఖీలో పాఠశాల హచ్ఎం కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మధుకుమార్, నాగేశ్వరరావులు సహకరించారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్త

రొంపిచర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామంలో పంటలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం నగేష్, జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివ కుమారి, ఏడీఏ మస్తానమ్మలు బుధవారం పరిశీలించారు. మిరప, మొక్క జొన్న, శనగ పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో శివలలిత, వీఏఏ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.